PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 122 | విజయవాడ, బుధవారం 4 డిసెంబర్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Wednesday 4 December 2024 | Rs



టాప్‌లోనే ఆంధ్ర

కేరళపై ఆరు వికెట్ల తేడాతో గెలుపు

సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ

6

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

- మంత్రి నారా లోకేష్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయనున్నట్లు మంత్రి నారా లోకేష్ తెలిపారు. పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యపై నిర్వహించిన మంగళవారం నిర్వహించిన సమీక్షలో మంత్రి లోకేష్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు స్టార్ రేటింగ్ ఇవ్వాలని నిర్ణయించారు. ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు సూచనల మేరకు నైతిక విలువలపై పాఠ్యాంశాలు పెట్టనున్నట్లు మంత్రి తెలిపారు.

ఆరు నెలలు పూర్తయింది..
నివేదికలివ్వండి

మంత్రివర్గ సమావేశంలో సిఎం ఆదేశం • అమరావతికి నెలాఖరులోగా టెండర్లు డిసెంబరు 15న ఆత్మార్పణ దినం • కేబినెట్ నిర్ణయాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తయిన నేపథ్యంలో శాఖలవారీగా పనితీరుపై నివేదికలు రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన మంగళవారం కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రస్తావించినట్లు తెలిసింది. 'ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తయింది. ఈ దృష్ట్యా పనితీరును సమీక్షించుకోవాలి. శాఖల వారీగా ఏం చేశారో సమగ్ర నివేదికలు రూపొందించి ఇవ్వండి' అని ఆయన అన్నట్లు సమాచారం. కొన్ని శాఖలు మంచి తీరు కనిపిస్తున్నాయని, మరికొన్నింటిలో మెరుగు పరుచుకోవాల్సి ఉందని ఈ సందర్భంగా ఆయన అన్నట్లు తెలిసింది. మద్యం, ఇసుక మాఫియాలను అరికట్టగలిగినట్లు సిఎం చెప్పారు. అయితే, బియ్యం, భూ ఆక్రమణల మాఫియాలు ప్రభుత్వానికి సవాల్‌గా మారాయని ఆయన అన్నారు. ఈ మాఫియాలను కూడా త్వరలోనే అదుపుచేస్తామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా కాకినాడ పోర్టు వ్యవహారాన్ని చంద్రబాబు ప్రస్తావించినట్లు తెలిసింది. 'కాకినాడ పోర్టులో 41శాతం వాటాను అరబిందో వాళ్లు లాక్కున్నారు. వైసిపి పాలనలో ఆస్తులు లాక్కోవడం ట్రెండ్‌గా మారింది' అని ఆయన అన్నట్లు సమాచారం. రాష్ట్రంలో జల్‌జీవన్‌మిషన్ పనులు జరుగుతున్న తీరు పట్ల ఆయన అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు సమచారం



కేబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

మూడేళ్లలో రాజధాని పనులు

సమావేశం అనంతరం ఐ అండ్ పిఆర్ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వివరించారు. రాజధాని అమరావతిలో కీలక కట్టడాలైన అడ్మినిస్ట్రేటివ్ టవర్స్, అసెంబ్లీ,హైకోర్టు నిర్మాణాలకు ఈనెలాఖరులోగా టెండర్లు పిలవాలని నిర్ణయించినట్లు చెప్పారు. వీటి నిర్మాణ పనులు మూడు సంవత్సరాల్లో పూర్తిచేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం అవలంభించిన ఆర్థిక విధ్వంసం ఫలితంగా నిర్మాణాల వ్యయం 30శాతం పెరిగిందన్నారు. గత ఐదేళ్లలో రు.286.78కోట్లు డ్యామేజ్ జరిగిందని, ఈ నేపథ్యంలో తిరిగి తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అనేక కమిటీలు వేసి అభివృద్ధి పనుల నిర్వహణకు అడ్డుగా ఉన్న ఆటంకాలను, చట్టపరమైన సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. రూ.11,471 కోట్ల పనులకు పాత టెండర్లు రద్దు చేసి కొత్త టెండర్లు పిలిచేందుకు సిఆర్‌డిఎ అథారిటీ నిర్ణయించిందని, ఆ నిర్ణయాన్ని మంత్రిమండలి ఆమోదించిందని చెప్పారు 1200కిలోమీటర్లు లే అవుట్ రోడ్లు, 3600 అపార్ట్‌మెంట్లు కూడా ఈ నిర్మాణ పనుల్లో ఉన్నాయని మంత్రులు పార్థసారధి, పి.నారాయణ తెలిపారు. రాష్ట్ర సాధన కోసం ఆత్మత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు వర్ధంతియైన డిసెంబర్ 15ను ఆత్మార్పణ దినంగా నిర్ణయించాలని కేబినెట్ నిర్ణయించింది. రాష్ట్ర కార్యక్రమంగా దీనిని నిర్వహించనున్నారు. పొట్టిశ్రీరాములు జన్మస్థలంలోని ఆయన నివాసాన్ని మ్యూజియంగా మార్చాలని కూడా మంత్రిమండలి నిర్ణయించింది. జలవనరుల శాఖ ప్రతిపాదనల మేరకు శ్రీకాకుళం జిల్లా ఉద్దానం, వైఎస్ఆర్ జిల్లా పులివెందుల నియోజకవర్గం, కర్నూలు జిల్లా డోన్ నియోజకవర్గాల్లో మూడు నీటి సరఫరాకు మంత్రి మండలి మిగతా 5లో

పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులపై అంతర్గత కమిటీలు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : అన్ని ప్రభుత్వ విభాగాలు, సంస్థల్లోని పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులను అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసిసి)లను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలను, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. 2013లో లైంగిక వేధింపుల నిరోధక (పిఒఎస్‌హెచ్) చట్టం అమల్లోకి వచ్చినా ఇప్పటికీ తీవ్రమైన లోపాలు నెలకొనడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రభుత్వాల స్థాయిలో అధికారుల అలసత్వమే దీనికి కారణమని పేర్కొంది. జాతీయస్థాయిలో ఈ చట్టానికి అందరూ కట్టుబడి వుండేలా చూసేందుకు ఇటువంటి కమిటీల ఏర్పాటు అవసరమని స్పష్టం చేసింది. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల ఆరోపణలపై దర్యాప్తునకు కమిటీలను ఏర్పాటు చేశారా? లేదా? అని నిర్దిష్ట కాలపరిమితిలో నిర్ధారించాల్సిందిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన ఆదేశాలు అమలు కావడం లేదంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన బెంచ్ ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ చట్టం దేశవ్యాప్తంగా ఏకరీతిన అమలు కావాలని కోరింది. డిసెంబరు 31కల్లా ప్రతి జిల్లాలో ఒక ఆఫీసర్‌ను నియమించాలని, ఆ అధికారి వచ్చే ఏడాది జనవరి 31కల్లా స్థానిక ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలని, తాలుకా స్థాయిల్లో నోడల్ అధికారులను నియమించాలని ఆదేశించింది. పిఒఎస్‌హెచ్ చట్టంలోని సెక్షన్ 26 కింద ఐసిసి ఏర్పాటుకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో సర్వే నిర్వహించాలని డిప్యూటీ కమిషనర్లు లేదా జిల్లా మేజిస్ట్రేట్లను కోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాల అమలుకు వచ్చే ఏడాది మార్చి 31వరకు గడువు ఇచ్చింది. ఈ ఆదేశాల అమలును పర్యవేక్షించాలంటూ చీఫ్ సెక్రటరీలను ఆదేశించింది.



పార్లమెంట్ వద్ద ఆందోళన చేస్తున్న ప్రతిపక్షాల నేతలు

తప్పించుకోలేరు

- జవాబుదారీ వహించాల్సిందే
- అదానీ వ్యవహారంలో ప్రధాని మౌనంపై ప్రతిపక్షాల ధ్వజం
- జెపిసితో విచారణకు డిమాండ్
- పార్లమెంట్ ఆవరణలో ఆందోళన


ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అదానీ ముడుపుల వ్యవహారంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నోరు విప్పకపోవడంపై పతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీనికి ప్రధానే జవాబుదారీ వహించాలని డిమాండ్ చేశాయి. మంగళవారం పార్లమెంట్ మకర ద్వారం వద్ద ప్రతిపక్ష పార్టీల ఎంపీలు ఆందోళన నిర్వహించారు. 'మోడీ.. అదాని ఒక్కటే అంటూ... అదానితో ప్రధాని మోడీ చేతులు కలుపుతున్న ఫొటోతో కూడిన ప్లకార్డులను ఎంపీలు ప్రదర్శించారు. కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, ఆప్, ఆర్‌జెడి, శివసేన (యుబిటి), డిఎంకె, ఎన్‌సిపి, జెఎంఎం, కేరళ కాంగ్రెస్, ఐయుఎంఎల్ తదితర పార్టీల ఎంపీలు ఈ ఆందోళనలో భాగస్వాములయ్యారు. ఎంపీల ధర్నానుద్దేశించి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ..' అదాని కూడబెట్టుకున్న వందలు వేల కోట్ల సంపద నుండి లబ్ధి పొందుతున్నదెవరో చెప్పండి మోడీ జీ? అని ప్రశ్నించారు. అదానీ ముడుపుల వ్యవహారంపై ప్రధాని మౌనం చాలా అంశాలు స్పష్టం చేస్తుంది' అని విమర్శించారు. ధర్నాలో కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ, ఆర్‌జెడి నేత మీసా భారతి, సిపిఎం ఎంపి వి శివదాసన్, సిపిఐ ఎంపి సంతోష్ కుమార్, ఆప్ ఎంపి సంజయ్ సింగ్, డిఎంకె ఎంపి టిఆర్ బాలు, జెఎంఎం ఎంపి మహువా మాంఝీ, శివసేన (యుబిటి) అరవింద్ సావంత్‌తో సహా ప్రతిపక్ష పార్టీల ఎంపిలు పాల్గొన్నారు.

ఇండియా బ్లాక్ పార్టీల భేటీ

పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై ఇండియా బ్లాక్ పార్టీలు భేటీ అయ్యాయి. రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ భేటీలో రాహుల్ గాంధీతో సహా ఇండియా బ్లాక్ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. అదాని అంశంతోపాటు ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, నిధుల కోత, మణిపూర్ సంక్షోభం వంటి అంశాలపైనా చర్చ జరగాలని ఇండియా బ్లాక్ పార్టీలు డిమాండ్ చేశాయి.

లోక్‌సభలో ప్రతిపక్షాల వాకౌట్ 6



GOVERNANCE AND STRENGTHENING THE INSTITUTIONS

Establishment of a Regulatory Commission: The proposal includes the creation of the "AP Water Resources Regulatory Commission" (APWRRC) through legislation, which will oversee and enhance water management policies, ensuring a coordinated approach to making the state drought-proof.


జల వనరుల నియంత్రణ కమిషన్‌ను ప్రతిపాదిస్తూ వాటర్ పాలసీలో పేర్కొన్న పేజీ

నీటికీ రెగ్యులేటరీ కమిషన్

- విద్యుత్ మాదిరి ఛార్జీలు వసూలు!
- వాటర్ పాలసీలో ప్రస్తావన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రజల నెత్తిన ప్రపంచ బ్యాంకు ఆదేశిత పెనుభారం నీటి రెగ్యులేటరీ కమిషన్ రూపంలో పడనుంది. ఇప్పటికే విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్‌తో ఇబ్బందులు పడుతున్న రాష్ట్ర ప్రజలపై ఇది మరో భారంగా మారనుంది. ప్రపంచ బ్యాంకు ఆదేశిత విధానాలను అనుసరిస్తున్న దేశాల్లో ప్రధానంగా నీరు, విద్యుత్‌ను వ్యాపార సరుకుగా మారుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోనూ వేగంగా దీన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగానే వాటర్ పాలసీని తీసుకొచ్చి దాని అమలు కోసం రెగ్యులేటరీ కమిషన్‌ను ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా ఇక నుండి నీటి నిర్వహణను పర్యవేక్షించడం నియంత్రించడం వంటి పనులు చేపట్టనున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న వినియోగపద్ధతులను క్రమబద్ధీకరించేందుకు రెగ్యులేటరీ కమిషన్ అవసరం ఉందని పేర్కొన్నారు. నీటి వినియోగానికి సంబంధించిన అంశాలన్నిటినీ రెగ్యులేటరీ కమిషన్ పర్యవేక్షించే అవకాశం ఉందని, ప్రస్తుత పాలసీలో అంత లోతైన అంశాలు ప్రస్తావించకపోయినా రెగ్యులేటరీ కమిషన్ ఉద్దేశం అదేనని, ఇక నుండి నీటి వినియోగానికి పూర్తి స్థాయిలో డబ్బు వసూలు చేసే అవకాశం ఉందని ఓ ఉన్నతాధికారి తెలిపారు. గతంలో చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్న సమయంలో ప్రపంచ బ్యాంకు సంస్కరణల్లో భాగంగా నీటి వినియోగదారుల సంఘాలను ఏర్పాటు చేసి సాగునీటి మీటర్లు పెట్టి నీటిని లెక్కించాలనే ప్రయత్నం జరిగింది. దీనిపై అప్పట్లో పెద్దయెత్తున వ్యతిరేకత రావడంతో వెనక్కి తగ్గారు. ఇప్పుడు ఏకంగా రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధపడింది. అదే గనుక జరిగితే రాష్ట్ర ప్రజలపై ఊహించని రీతిలో భారాలు పడవచ్చు.



104పై 'ఎస్మా'

- ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు ఆదేశాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్యారోగ్యశాఖ పరిధిలోని 104 విభాగంపై ఎస్మా విధించారు. ఆరు నెలలపాటు సమ్మెలు నిషేధిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. దీనిపై వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులి చ్చారు. ఆంధ్రప్రదేశ్ అత్యవసర సర్వీసుల నిర్వహణ చట్టం-1971లోని సబ్‌క్లాజ్ (6), సెక్షన్(1), సెక్షన్ 2 ప్రకారం ఈ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. దీని ప్రకారం రాష్ట్రంలోని 104 సర్వీసుల విభాగంలో ఆరు నెలలపాటు ఎటువంటి సమ్మెలూ నిర్వహించ డానికి వీల్లేదని పేర్కొన్నారు. చట్టంలోని సబ్ సెక్షన్ (1),(3) సెక్షన్ 3 ప్రకారం ఈ నిషేధం విధించినట్లు తెలిపారు. ఉత్తర్వులు విడుదలైన వెంటనే ఈ నిషేధం అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు.

విద్యుత్ శాఖ అభ్యంతరాలూ బేఖాతర్

సెకి SECI

- సెకి ఒప్పందంలో విస్మయకర అంశాలు
- కేంద్రం ఒత్తిడే కారణమా?

ప్రజాశక్తి -అమరావతి బ్యూరో

సెకితో కుదుర్చుకున్న ఒప్పందంలో విద్యుత్ శాఖ లేవనెత్తిన పలు అభ్యంతరాలను నాటి ప్రభుత్వం తిరస్కరించినట్లు తెలిసింది. ఈ అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని ఉంటే ప్రజలకు కొంత మేరకు ఉపశమనం లభించేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సెకి నుండి సౌర విద్యుత్ కొనుగోళ్ల కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని హడివిడిగా విద్యుత్ శాఖను ఆదేశించడం, అతి తక్కువ సమయంలోనే ఆ శాఖ అధికారులు లేవనెత్తిన పలు అభ్యంతరాలను రాష్ట్ర ప్రభుత్వం బేఖాతరు చేయడం వెనుక కేంద్ర ప్రభుత్వ ఒత్తిడి ఉందని అంటున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీకి అత్యంత సన్నిహితుడైన గౌతమ్ అదాని 2021 సెప్టెంబర్ 12వ తేదిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన విషయం తెలిసిందే. ఈ భేటీని కూడా అప్పటి ప్రభుత్వ గోప్యంగా ఉంచడానికి ప్రయత్నించింది. ఈ సమావేశం తరువాతే సెకితో ఒప్పందానికి సంబంధించిన పనులు శరవేగంగా సాగాయి. సెకి నుండి ఎటువంటి ఆఫర్ లెటర్ లేకుండానే కేబినెట్ సమావేశానికి నోట్ తయారు చేయాలన్న ఒత్తిడి విద్యుత్ అధికారులపై పెరిగింది. 14వ తేదే ఈ మేరకు ఆదేశాలు అందగా, 15వ తేది సెకి నుండి అధికారికంగా విద్యుత్ శాఖ అధికారులకు లేఖ అందింది. 16వ తేదే కేబినెట్ సమావేశం ఉండటంతో రాష్ట్ర పవర్ కోఆర్డినేషన్ కమిటీ (పిసిసి)తో చర్చించిన తరువాత కొన్ని అభ్యంతరాలను, సూచనలను విద్యుత్ శాఖ చేసింది. అయితే, దాదాపుగా వీటన్నింటిని అప్పటి ప్రభుత్వం తిరస్కరించింది. అదాని గ్రూపునకు భారీ మొత్తంలో లబ్ధి చేకూర్చడానికే విద్యుత్ శాఖ చేసిన సూచనలను తిరస్కరించారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ఈ చర్య వెనుక కూడా కేంద్రం ఒత్తిడి ప్రభావం ఉండి ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆర్థిక శాఖ సూచనలు కూడా...

సమయం తక్కువ ఉన్నప్పటికీ విద్యుత్ శాఖ సూచనలు చేసిన సెప్టెంబర్ 15 వ తేదినే వాటిని పరిశీలించి ఆర్థికశాఖ కూడా కొన్ని సూచనలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ సంస్థయైన జిఇసిఎల్ ప్రాజెక్టు కోసం ఆమోదించిన 8,443 కోట్ల రూపాయలకు మించి కొత్త ఒప్పందం కోసం అదనపు ఖర్చు కాకూడదని, సెకి ఒప్పందానికి ముందే జిఇసిఎల్ టెండర్లను రద్దు చేసుకోవాలని, ముందుగానే టారీఫ్ ఖరారు చేయాలని ఆర్థిక శాఖ మిగతా 6లో

విద్యుత్ శాఖ ఏం చెప్పింది?

- భవిష్యత్తులో విద్యుత్ సరఫరా చేసే నాటికి సెకి టెండర్లలో యూనిట్ ధర రూ.2.49 కన్నా తక్కువ ఉంటే, ఆ తగ్గిన మొత్తానికే విద్యుత్ సరఫరా చేయాలి.
- పన్నులు, రుసుములు కలిపి ఎటువంటి పరిస్థితుల్లోనూ యూనిట్ దర రూ. 2.49 కన్నా మించరాదు.
- సెకి ప్రతిపాదించిన 9 గిగా వాట్ల విద్యుత్ కాకుండా అవసరం మేరకే కొనుగోలు చేయాలి.
- రాష్ట్ర సరిహద్దు వరకు ట్రాన్స్‌మిషన్ ఛార్జీలు, నష్టాల నుండి మినహాయింపు ఇవ్వాలి.

కదం తొక్కిన మధ్యాహ్న భోజన కార్మికులు

- కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలి
- సామాజిక భద్రత, పెన్షన్ అమలు చేయాలి
- పార్లమెంట్ మార్చ్‌లో తపన్ సేన్



ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, పార్లమెంట్ మార్చ్‌లో మాట్లాడుతున్న తపన్‌సేన్ (ఇన్‌సెట్‌లో)

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మధ్యాహ్న భోజన కార్మికులను క్రమబద్ధీకరించాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు చొప్పున 12 నెలల పాటు ఇవ్వాలని, సామాజిక భద్రత, పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధాని హస్తినలో కదం తొక్కారు. మిడ్డే మీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా - ఎండిఎండబ్ల్యుఎఫ్ఐ (సిఐటియు) ఆధ్వర్యాన మంగళవారం 14 రాష్ట్రాలకు చెందిన వేలాదిమంది మధ్యాహ్న భోజన కార్మికులు ఈ మార్చ్‌లో పాల్గొన్నారు. ప్లకార్డులు చేబూని బిగ్గరగా నినదించారు. సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా కార్మిక-కర్షక ఉమ్మడి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని, రాష్ట్రాల్లో పోరాటాన్ని ఉధృతం చేయాలని ర్యాలీ పిలుపునిచ్చింది. ఫెడరేషన్ అధ్యక్షులు కృష్ణరాయ్ ఛటర్జీ, కోశాధికారి హిమీ ఠాకూర్ అధ్యక్షతన జరిగిన ఈ మార్చ్‌ను సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నప్పటికీ వేతనాలు పెంచటం లేదని, ఉద్యోగులుగా గుర్తించటం లేదని విమర్శించారు.

పెన్షన్ సదుపాయం కూడా లేదని, ఎటువంటి సామాజిక భద్రత లేకుండా మధ్యాహ్న భోజన కార్మికులు పని చేస్తున్నారని చెప్పారు. మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని, కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. కార్పొరేట్ అనుకూల, కార్మిక వ్యతిరేక విధానాలను మార్చేందుకు మిగతా 2లో

సిఐడి మాజీ చీఫ్ సంజయ్‌పై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఐడి విభాగం మాజీ అధిపతి, ఐపిఎస్ అధికారి ఎస్ సంజయ్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఆయన అగ్నిమాపకశాఖ డైరెక్టర్ జనరల్‌గా పనిచేసిన సమయంలో ఆ అధికారిక హోదాను అడ్డంపెట్టుకుని రూ.కోటి దుర్వినియోగానికి పాల్పడినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తేల్చింది. ఈ మేరకు తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి విచారణ నివేదిక సమర్పించింది. దీని ఆధారంగా సంజయ్‌ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సస్పెన్షన్ సమయంలో హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లరాదని ఉత్తర్వుల్లో పేర్కొంది.

యాంకరేజ్ పోర్టు భవితవ్యంపై నీలినీడలు

- వివాదాలతో కాకినాడ ప్రతిష్టకు దెబ్బ
- కార్మికుల్లో ఆందోళన

2

కడప ఉక్కు లేనట్టే!

- లోక్‌సభలో కేంద్ర మంత్రి కుమార స్వామి



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కడప స్టీల్‌ప్లాంట్ పరిశీలనలో లేదని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామి తెలిపారు. లోక్‌సభలో జనసేన ఎంపి వల్లభనేని బాలశౌరి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి మంగళవారం సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కడపలో ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు హామీ ఇచ్చి పదేళ్లు గడిచినా ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని ఎంపీ అన్నారు. ఎపి పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీ కాబట్టి మంత్రి ఈ అంశాన్ని తీసుకుంటారా? లేదా? అనేది తెలియాల్సి ఉందన్నారు. దీనికి కేంద్ర మంత్రి కుమారస్వామి సమాధానం ఇస్తూ.. ప్రస్తుతం ఆ అంశం మంత్రిత్వశాఖ పరిశీలనలో లేదని, ఆ సమస్య వస్తే దానిని పరిశీలించేందుకు ప్రయత్నిస్తామని అన్నారు.

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగుతోంది

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పెట్టుబడుల ఉపసంహరణ (ప్రైవేటీకరణ) కొనసాగుతోందని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డి కుమార స్వామి పేర్కొన్నారు. లోక్‌సభలో కీర్తి ఆజాద్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణకు 2021 జనవరి 27న ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ సూత్రప్రాయంగా అంగీకరించిందని తెలిపారు. పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించి లావాదేవీలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌తోపాటు ఎన్ఎస్ఎల్ కూడా కొనసాగుతున్నాయని తెలిపారు. ఎఫ్ఎస్ఎన్ఎల్‌కు సంబంధించి ఒప్పందాలపై సంతకాలు అయ్యాయన్నారు.

ఎస్మా ప్రయోగం దుర్మార్గం

- సిఐటియు రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

104 సేవల్లో ఎస్మా ప్రయోగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడాన్ని సిఐటియు ఎపి రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. దీనిపై రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. 104 ప్రధాన యజమానిగా ఉన్న వైద్యారోగ్యశాఖ సమస్యను పరిష్కరించకపోగా ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమని పేర్కొన్నారు. 104 సిబ్బంది చేపట్టిన ఆందోళనకు సిఐటియు సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. ఎస్మా ప్రయోగాన్ని ఎపి స్టేట్ గవర్నమెంటు కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ స్టేట్ కమిటీ కూడా ఖండించింది. దీనిపై గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు ప్రకటన విడుదల చేశారు.

ప్రేమ జంట ఆత్మహత్య

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)



దుర్గారావు, సాయి సుస్మిత (ఫైల్‌ఫొటో)

మూడంతస్తుల భవనం పైనుంచి దూకి ఓ ప్రేమ జంట ఆత్మహత్య చేసుకున్న సంఘటన విశాఖలోని గాజువాక పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎసిపి త్రినాథరావు తెలిపిన వివరాల ప్రకారం.. అమలాపురం ప్రాంతానికి చెందిన పిల్లి దుర్గారావు (32), నూకల సాయి సుస్మిత (25) గాజువాక వెంకటేశ్వర కాలనీలోని ఓ అపార్టుమెంట్‌లో ఆరు నెలలుగా అద్దెకు ఉంటున్నారు. దుర్గారావు విశాఖలో క్యాటరింగ్ పనులు చేస్తుండగా, సాయి సుస్మిత హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఒకే ప్రాంతానికి చెందిన వారు కావడంతో వారి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఈ క్రమంలో ఇద్దరు కలిసి అద్దెకు ఉంటున్న భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఘటనా స్థలాన్ని ఎసిపి త్రినాథరావు, సిఐ పార్థసారథి పరిశీలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని, విచారణ అనంతరం పూర్తి వివరాలు తెలియజేస్తామని వారు చెప్పారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

మళ్లీ జన్మభూమి కమిటీలు

- వైసిపి కో-ఆర్డినేటర్ సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి అందరికీ అందుబాటులో ఉండే పార్టీ అని ఆ పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని మండల పరిషత్ అధ్యక్షులు (ఎంపిపి)తో సమావేశాన్ని తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..

పార్టీ శక్తి పుంజుకోవాల్సిన అవసరం వచ్చిందన్నారు. వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల వల్ల ప్రజల్లో చెక్కు చెదరని అభిమానం ఉందన్నారు. ఈ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు మళ్లీ వచ్చాయన్నారు. సంపాదించుకునేందుకు దోపిడీలు చేస్తున్నారని చెప్పారు. సిఎంగా ప్రమాణ స్వీకారం చేయకముందే చంద్రబాబు రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మార్చారన్నారు. వైసిపి లేకుండా చేయాలని బాబు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. చివరికి తిరుపతి లడ్డూపై రాజకీయం చేశారన్నారు. పోర్టులు, ఆస్పత్రులు, మెడికల్ కళాశాలలు, చివరికి రోడ్లు కూడా ప్రైవేటుపరం చేస్తున్నారన్నారు.

కదంతొక్కిన మధ్యాహ్న భోజన కార్మికులు

మొదటిపేజి తరువాయి

ఉమ్మడి పోరాటాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

సిఐటియు కార్యదర్శి ఎఆర్ సింధు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా పోరాటాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాల్లో ఉధృత పోరాటాలు నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి మాలిని మేస్తా మాట్లాడుతూ..

ఇప్పటి వరకు సమాఖ్య చేసిన పోరాటాలు, సాధించిన డిమాండ్ల సమస్యలు, చార్టర్‌ను వివరించారు. దేశవ్యాప్తంగా స్కీమ్ వర్కర్ల ఉద్యమాన్ని, ఐక్యతను క్షేత్రస్థాయి వరకు బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఉపాధ్యక్షులు జై భగవాన్, ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజు కృష్ణన్, ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్, ఆశాశర్మ (ఐద్వా), సురేఖ (ఎడబ్ల్యుఎఫ్ఎఫ్ఐ) తదితర ప్రజా సంఘాల నేతలు సంఘీభావం తెలిపారు. మార్చ్‌లో ఫెడరేషన్ ఉపాధ్యక్షులు జై భగవాన్, వివిధ రాష్ట్రాల నాయకులు ఎస్ రమ (ఆంధ్రప్రదేశ్), స్వప్న (తెలంగాణ) తదితరులు పాల్గొన్నారు.

యాంకరేజ్ పోర్ట్ భవితవ్యంపై నీలినీడలు

- వివాదాలతో కాకినాడ ప్రతిష్టకు దెబ్బ
- కార్మికుల్లో మొదలైన ఆందోళన

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

కాకినాడ యాంకరేజీ పోర్టు భవితవ్యంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. బియ్యం మాఫియా వివాదంతో పోర్టు ప్రతిష్ట దెబ్బతింటోంది. ఇక్కడికి రావాల్సిన నౌకలు వేరే పోర్టులకు తరలిపోతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే పోర్టు కార్యకలాపాలు మందగించే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. కాకినాడ పోర్టు స్మగ్లర్లకు అడ్డాగా మారిపోయిందని, ఇక్కడి నుంచి రేషన్ బియ్యం ఇతర దేశాలకు అక్రమంగా రవాణా అవుతోందని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ తరచూ తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఎన్నికల సమయంలోనూ ఇటువంటి ఆరోపణలే చేశారు. గత నెల 27న నిర్వహించిన తనిఖీల్లో భాగంగా కాకినాడ పోర్ట్ ద్వారా బియ్యం అక్రమ రవాణాలో ఎవరున్నా, ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరించారు. ఓడను సీజ్ చేయాలని ఆదేశించారు. కానీ, అలాంటి చర్యలేవీ కనిపించలేదు. మంగళవారం రాష్ట్ర కేబినేట్ సమావేశం అనంతరం కాకినాడలో కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి విలేకర్ల సమావేశం నిర్వహించారు. స్టెల్లా ఎల్ నౌకలో లోడ్ చేసిన మొత్తం బియ్యాన్ని సమగ్రంగా తనిఖీ చేసేందుకు ఐదు ప్రభుత్వ శాఖల అధికారులతో మల్టీ డిసిప్లినరీ కమిటీ ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. రేషన్ మాఫియాను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా దీనిని అడ్డుకోలేకపోయిందనే విమర్శలు ఉన్నాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ వ్యాఖ్యలు దీనిని పరోక్షంగా అంగీకరించనట్లు ఉన్నాయని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ప్రభుత్వ వైఫల్యాన్ని పోర్టుపైకి నెట్టి కాకినాడ ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



రాజకీయ ఎత్తుగడలకు కార్మికులు బలిచేయొద్దు

తక్షణం బియ్యం అక్రమ రవాణాపై నిర్ణీత సమయంలోపు విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించాలి. అక్రమాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. ఈ వివాదాన్ని ఆసరాగా తీసుకుని యాంకరేజ్ పోర్ట్‌ను నిర్వీర్యం చేయాలనే కుట్ర మానుకోవాలి. ఈ పోర్ట్‌పై ఆధారపడి వేల మంది కార్మికుల ఉపాధిని దృష్టిలో పెట్టుకుని, నష్టం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించాలి.

**- సిహెచ్.రాజ్‌కుమార్,
సిఐటియు జిల్లా కార్యదర్శి, కాకినాడ**

ఇతర పోర్టులకు తరలిపోతున్న నౌకలు

కాకినాడ పోర్టుకు రావాల్సిన నౌకలు బియ్యం అక్రమ రవాణా ఆరోపణల నేపథ్యంలో ఇతర పోర్టులకు తరలిపోతున్నాయని పోర్టు వర్గాలు తెలిపాయి. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 1.30 లక్షల మెట్రిక్ టన్నుల కెపాసిటీగల మూడు షిప్‌లు కాకినాడ పోర్టు నుంచి విశాఖ పోర్టుకు కార్యకలాపాలను మార్చుకున్నాయని చెప్పాయి. ఈ నౌకల్లో ఆఫ్రికా దేశాలకు ఎగుమతులు అవుతున్నాయి. కొందరు ఎగుమతిదారులు ప్రైవేట్ పోర్టు వైపు కూడా మళ్లుతున్నట్లు సమాచారం..

కార్మికుల ఉపాధికి ఎసరు

కాకినాడ యాంకరేజీ పోర్టుపై వస్తున్న వివాదాలు కార్మికుల ఉపాధికి ఎసరు పెట్టేలా ఉన్నాయి. ఈ పోర్టును నమ్ముకుని సుమారు 20 వేలకు మందికిపైగా కార్మికులు ఉపాధి పొందుతున్నారు.

ఎగుమతి, దిగుమతి కార్మికుల తోపాటు సర్వేయర్ అండ్ టాలీ, బాలబంధు (బస్తాలు కుట్టేవారు), స్వీపర్లు, బార్జీలకు పెయింటింగ్, ఫిట్టింగ్ పనులు చేసే ఫ్యాబ్రికేటర్లు ఇలా వివిధ రూపాల్లో పోర్టులో పని చేస్తున్నారు. నౌకలు ఇక్కడి నుంచి తరలిపోతే పోర్టులో కార్యకలాపాలు నిలిచిపోయి వారంతా ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది.

వెంటనే జీతాలు చెల్లించాలి

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 123 మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న 48 వేల మంది ఇంజినీరింగ్ పారిశుధ్య కార్మికులకు అక్టోబరు నెల వేతనాలు వెంటనే చెల్లించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నాగభూషణం, కె ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డిసెంబర్ మూడో తేదీ వచ్చినా ఇప్పటికీ అక్టోబర్ నెల వేతనాలు వేయకపోవడంతో కార్మికుల కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయని పేర్కొన్నారు. ఇంటి అద్దెలు, కిరాణా షాపుల్లో అప్పులు తీర్చకపోవడంతో కొత్త అప్పులు ఇవ్వడానికి యజమానులు అంగీకరించడం లేదని పేర్కొన్నారు. పిల్లల స్కూలు ఫీజులు, కరెంటు బిల్లులు మందుల ఖర్చుల అవసరాలు తీరక మున్సిపల్ కార్మికులు అగచాట్లు పడుతున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వారి జీతాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

ఎంఆర్‌పి స్టిక్కర్లకు పెట్టెకు రూ.12.60 చెల్లించాలి

రాష్ట్రంలో 29 మద్యం డిపోల్లో ఉన్న బాటిళ్లపై ఎంఆర్‌పి రేటు స్టిక్కర్ అతికించేందుకు మద్యం పెట్టెకు రూ.12.60 పైసలు, మెనోకాటన్‌కు రూ.14.60 పైసలు సప్లయర్ల నుండి హమాలీలకు ఇప్పించాలని ఎపిబిసిఎల్ ఐఎంఎఫ్ఎల్ డిపోస్ హమాలీ యూనియన్ (సిఐటియు) ఎమ్‌డికి వినతిపత్రం సమర్పించింది. వినతిపత్రం ఇచ్చిన వారిలో యూనియన్ గౌరవాధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్బారెడ్డి, ఎం మదన్‌మోహన్, ఉపాధ్యక్షులు ఎన్ ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

సిపిఐ మద్దతు కోరిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతో లక్ష్మణరావు

శాసనమండలి ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణను పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు కోరారు. విజయవాడలోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో రామకృష్ణను మంగళవారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత 14 ఏళ్లుగా శాసనమండలిలో, బయట ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, నిరుద్యోగులు, విద్యార్థులు, స్కీం వర్కర్లు, రైతులు, కార్మికులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై జరిగే పోరాటాలకు ప్రాతినిధ్యం వహిస్తూ, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతున్నట్లు లక్ష్మణరావు తెలిపారు. శాసనమండలి సభ్యులుగా ఉద్యమాలన్నిటికీ అండదండలు అందిస్తూ బలపరుస్తున్నామని తెలిపారు. రాజ్యాంగ విలువలు, లక్ష్యాలు పరిరక్షణకు కృషి చేస్తూ, నిబద్ధతతో పని చేస్తున్నామన్నారు. ఈ ఎన్నికల్లో వివిధ సంఘాలు, రాజకీయ పార్టీల మద్దతు కోరుతున్నానని, ఇప్పటికే దాదాపు 50కు పైగా సంఘాలు మద్దతు తెలిపాయని చెప్పారు. సిపిఐ కూడా మద్దతు ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ప్రతి ఎకరాకు సాగునీరు.. ప్రతి గ్రామానికీ తాగునీరు

- త్వరలో వాటర్ పాలసీ
- పోలవరం పనులకూ షెడ్యూల్
- జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్రంలో దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రతి గ్రామానికీ తాగునీరు అందించేందుకు వాటర్ పాలసీ తీసుకొస్తున్నామని, పోలవరం పూర్తి చేసేందుకు షెడ్యూల్ విడుదల చేస్తున్నామని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మంగళవారం ఉదయం వెలగపూడి సచివాలయంలో జలవనరులశాఖపై సిఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మంత్రి రామానాయుడు మాట్లాడారు. ఇటీవల వర్షాలు, వరదలు వచ్చిన సమయంలో 11 వేల టిఎంసిల నీరు రాష్ట్రానికి వచ్చినా 954 టిఎంసిల నీటిని మాత్రమే వాడుకున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి నీటిబొట్టునూ ఒడిసి పట్టాలన్న లక్ష్యంతో వాటర్ పాలసీ తీసుకొస్తున్నట్లు చెప్పారు. అదే వాటర్ మేనేజ్‌మెంట్ అని కూడా పేర్కొన్నారు. అలాగే సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణను యుద్ధ ప్రాతిపదికన చేపడతామని వివరించారు. ఎపికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును యజ్ఞంలా 2027 నాటికి నిర్మాణం పూర్తి చేసేలా సిఎం చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా డిసెంబర్ రెండో వారంలో ముఖ్యమంత్రి పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తారని, అదేరోజు పోలవరం నిర్మాణానికి సంబంధించిన టైమ్ షెడ్యూల్‌ను విడుదల చేస్తారని పేర్కొన్నారు. దాని ప్రకారం పనులు జరిగేలా చూస్తామని చెప్పారు. పదిరోజుల్లో దీనిపై మరింత స్పష్టతతో షెడ్యూల్ విడుదల చేస్తామన్నారు. ఐదు నెలల్లోనే ప్రాజెక్టులపై షెడ్యూల్ విడుదల చేసేలా సమగ్ర విశ్లేషణ చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని వివరించారు. ఇప్పటికే ప్రాజెక్టుల డిజైన్లకు సూత్రప్రాయ అంగీకారం లభించిందని, పోలవరం ఆర్‌అండ్‌ఆర్ భూసేకరణకు సంబంధించి రూ.996 కోట్ల పెండింగ్ నిధులను విడుదల చేసేందుకు సిఎం ఆదేశాలు జారీచేశారని వివరించారు. గత ప్రభుత్వ పాలనలో పోలవరం ప్రాజెక్టు 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. పోలవరం విషయంలో అంతర్రాష్ట్ర సమస్యలకు సంబంధించి ఛత్తీస్‌గఢ్, ఒడిశాతో చర్చలు జరపాలని నిర్ణయం తీసుకున్నామని, కచ్చితంగా పోలవరం ఫలాలు రాయలసీమ, ఉత్తరాంధ్రకు అందిస్తామని చెప్పారు. హంద్రీనీవా పనులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, ప్రస్తుతం ప్రభుత్వం రూ.936 కోట్లు విడుదల చేస్తూ మంగళవారమే జిఓ కూడా ఇచ్చిందని తెలిపారు. డిసెంబర్, జనవరి నెలల్లో హంద్రీనీవా ప్రధాన కాల్వ పనులు మొదలుపెడతామని, దీనికోసం ఈ నెలలోనే టెండర్లు పిలుస్తామని అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితంగా చింతలపూడి ఎత్తిపోతల ఆగిపోయిందని పేర్కొన్నారు. దీనికి రూ.73 కోట్ల పెనాల్టీ విధించారని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టును సందర్శించి సమగ్ర అవగాహన చేసుకున్నామని, 2026 జూన్ నాటికల్లా నీటిని అందిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం రైతులను దగ్గరకు రానీయకుండా ప్రాజెక్టును జాతికి అంకితం చేశామని తప్పుడు ప్రచారం చేసిందన్నారు. ఆర్థిక సమస్యలు ఎన్ని ఉన్నా సవాళ్లెన్ని ఎదురైనా గోదావరి, కృష్ణా, పెన్నా నదుల అనుసంధానం పూర్తి చేయాలన్న లక్ష్యంతో సిఎం ముందుకు వెళుతున్నారని తెలిపారు. గోదావరి, కృష్ణా, బనకచర్ల ప్రాజెక్టు ఇదొక గేమ్ ఛేంజర్ అని అభిప్రాయపడ్డారు. వృథాగా సముద్రంలో కలుస్తున్న జలాలను మళ్లించి ప్రతి ఎకరాకూ సాగునీరు అందించాలంటే నదుల అనుసంధానం జరగాల్సిందేనని తెలిపారు. రాష్ట్రం రూపురేఖలు మార్చే నదుల అనుసంధానాన్ని రెండు, మూడు ఏజెన్సీలతో తక్కువ ఖర్చుతో చేపట్టేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను సిఎం చంద్రబాబు ఆదేశించినట్లు మంత్రి రామానాయుడు వెల్లడించారు.



విజయవాడ వాంబేకాలనీలో విద్యుత్ బిల్లులు చూపిస్తూ నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, స్థానికులు

విద్యుత్ భారాలు వద్దు

- అదానీ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి
- సిపిఎం ఆధ్వర్యంలో పలుచోట్ల ఆందోళనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రంలో పలుచోట్ల ఆదోళనలు చేపట్టారు. ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని, అదానీ విద్యుత్ ఒప్పందాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ భారాలను రద్దు చేయకపోతే మరో బషీర్‌బాగ్ పోరాటానికి సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. విజయవాడ వాంబే కాలనీ 60 డివిజన్ 'జి' బ్లాక్ వద్ద పెరిగిన కరెంటు బిల్లులు చూపిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.దుర్గారావు మాట్లాడుతూ.. పెరిగిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా నిరసనను పట్టించుకోకుండా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ముందుకెళితే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద రాస్తారోకోలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీల భారం ప్రజలపై వేయబోమని చెప్పి నేడు విద్యుత్ ఛార్జీలు పెంచడం అన్యాయమన్నారు. శృంగవరపుకోట, బొబ్బిలి, నెల్లిమర్ల మండల కేంద్రాల్లో ఆందోళనలు చేశారు.

ట్రూ అప్ ఛార్జీల భారాలకు నిరసనగా కడపలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గత వైసిపి ప్రభుత్వం ప్రజలపై విపరీతమైన భారాలు వేయడం కారణంగానే ఆ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దెదించారని, టిడిపి కూటమి ప్రభుత్వం పునరాలోచించి విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయకపోతే ప్రజలు ఉద్యమిస్తారని హెచ్చరించారు. పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరంలో ధర్నా, ఏలూరు జిల్లా పోలవరం ఏటిగట్టు సెంటర్లో నిరసన తెలిపారు.

ఎసిబి వలలో తహశీల్దార్

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు (నెల్లూరు జిల్లా)

ఓ రైతు నుంచి లంచం తీసుకుంటూ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ముత్తుకూరు తహశీల్దార్ ఎసిబి అధికారులకు మంగళవారం పట్టుబడ్డారు. ఎసిబి డిఎస్‌పి శిరీష తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తుకూరు మండలంలోని పంటపాలెం గ్రామానికి చెందిన రైతు వడ్లమూడి వెంకటరమణయ్య నాయుడు తన పొలాన్ని అడంగల్‌లో ఎక్కించేందుకు తహశీల్దార్ బాలకృష్ణారెడ్డిని సంప్రదించారు. అందుకు ఆయన రూ.50 వేలు డిమాండ్ చేయడంతో రైతు రూ.25 వేలు ఇచ్చేందుకు అంగీకరించారు. పొలానికి సంబంధించిన అన్ని రికార్డులూ సక్రమంగా ఉన్నప్పటికీ వన్-బి అడంగల్‌లో ఎక్కించేందుకు లంచం డిమాండ్ చేయడంతో వెంకట రమణయ్య నాయుడు ఎసిబి అధికారులను సంప్రదించారు. ఆయన నుంచి తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విచారణ పూర్తయిన తరువాత రిమాండ్‌కు తరలిస్తామని డిఎస్‌పి తెలిపారు.

రూ.కోటి కాజేశారు

- హైకోర్టులో విద్యాసాగర్ న్యాయవాది వాదన

ప్రజాశక్తి-అమరావతి

నటి జత్వానీ, ఆమె కుటుంబ సభ్యులు కె విద్యాసాగర్ నుంచి బలవంతంగా కోటి రూపాయలను కాజేశారని, పోలీసులు మాత్రం విద్యాసాగర్‌పైనే కేసు పెట్టారంటూ సీనియర్ న్యాయవాది ఎస్ నిరంజన్‌రెడ్డి.. హైకోర్టులో వాదించారు. బాధితుడినే నిందితుడి చేసి కేసులు పెట్టి వేధిస్తున్నారని చెప్పారు. జత్వానీ సెల్ ఫోన్లు, ఐపాడ్, ల్యాప్‌టాప్‌లలో కీలక సమాచారం ఉందన్నారు. జత్వానీ రెండు ఆధార్ కార్డులు ఉన్నాయన్నారు.

జత్వానీ సోదరుడికి అండర్ వరల్డ్ సంబంధాలున్నాయన్నారు. జత్వానీ ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వ్యాపారవేత్త విద్యాసాగర్ వేసిన పిటిషన్‌ను హైకోర్టు మంగళవారం విచారణ జరిపింది. జత్వానీ, పోలీసుల తరపున వాదనలు బుధవారం వింటామని జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ ప్రకటించారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న డిసిహెచ్ వెంకటేశ్వరరావు

'ఉక్కు' కార్మికులపై కక్ష సాధింపు తగదు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న కార్మికులపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉక్కు యాజమాన్యం కక్ష సాధింపు చర్యలకు దిగడం తగదని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు డిసిహెచ్ వెంకటేశ్వరరావు, కె గంగాధర్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1392వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని సిఐటియు కార్యకర్తలు కూర్చున్నారు.

వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు పెన్షన్ ఇవ్వకుండా ఆ అంశం కోర్టు పరిధిలో ఉందంటూ ప్రభుత్వం వారిని మానసిక ఆందోళనకు గురిచేస్తోందన్నారు. వారి సహనాన్ని ప్రభుత్వం చేతగానితనంగా పరిగణిస్తే ఐక్య ఉద్యమాలతో ప్రతిఘటిస్తామని స్పష్టం చేశారు. స్టీల్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. స్టీల్ యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వ తీరు వల్లే ఉక్కు కర్మాగారంలో ఉత్పత్తికి ఆటంకాలు కలుగుతున్నాయన్నారు. ప్లాంట్‌కు సొంత గనులు, ఆర్థిక వనరులు సమకూర్చి పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడిచేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కె భానుమూర్తి, సన్యాసిరావు, శ్రీనివాసరెడ్డి, జగ్గారావు, అప్పారావు, ఎర్రయ్య, కోటేశ్వరరావు, సోమినాయుడు, కె మహేష్, రమణమూర్తి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్‌టిసి విలీన సమస్యల పరిష్కారానికి కార్యాచరణ

- అవసరాలకు అనుగుణంగా నూతన బస్సుల కొనుగోలు : మంత్రి రామ్ ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, ఆయా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు రవాణాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సచివాలయంలో మంగళవారం ఆయన ఛాంబర్‌లో ఆర్‌టిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టికెట్ (కోర్), రాబడి నాన్ టికెట్ (నాన్ కోర్) ఆదాయాన్ని మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆదాయాన్ని పెంచుకోవడానికి బిఒటి, ఇతర వాణిజ్య ప్రాజెక్టుల కోసం ఉపయోగించాల్సిన భూముల గురించి చర్చించారు. బిఒటి/ఇతర ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై ప్రజా ప్రతినిధుల నుంచి స్వీకరించిన వాణిజ్య ప్రతిపాదనలు, అభివృద్ధి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాత బస్సుల స్థానంలో కొత్త బస్సుల కొనుగోలుకు సంబంధించిన ప్రతిపాదనల కార్యాచరణపై చర్చించారు. ఈ సమీక్షలో రవాణాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, ఎపిఎస్‌ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, ఫైనాన్షియల్ అడ్వైజర్లు పాల్గొన్నారు.

ఆర్‌జిఎస్‌ఎ అమలులో రాష్ట్రానికి 4వ స్థానం

- పిఆర్ కమిషనర్ కృష్ణతేజ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జిఎస్‌ఎ) అమలులో కేవలం 4 నెలల్లో ఆంధ్రప్రదేశ్ 4వ స్థానానికి చేరిందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ తెలిపారు. ఈ ఏడాది జూన్‌లో 24వ స్థానంలో ఉండగా, ప్రభుత్వం తీసుకున్న చర్యలు, అమలు చేస్తున్న కార్యక్రమాలతో 4వ స్థానానికి చేరిందని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఎపి స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఎపిఎస్‌ఐఆర్‌డిపిఆర్) సంస్థ ఆధ్వర్యంలో ఈ ఏడాది పంచాయతీరాజ్ సంస్థల్లో ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన 3 లక్షల మందికి శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకూ 1.36 లక్షల మందికి శిక్షణ ఇచ్చామన్నారు. మరో 1.04 లక్షల మందికి ఈ నెలలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఎపిఎస్‌ఐఆర్‌డిపిఆర్‌కు రెండు విడతలుగా రూ.22 కోట్లు అందించామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలశాఖ పరిధిలో ఉన్న ఈ సంస్థను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవతో తిరిగి పంచాయతీరాజ్ పరిధిలోకి తెచ్చారన్నారు. ఎపిఎస్‌ఐఆర్‌డిపిఆర్‌కు అమరావతిలో సొంత భవనాల నిర్మాణానికి కేంద్రాన్ని రూ.20 కోట్లు కోరామని, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, అన్నమయ్య, గుంటూరు జిల్లాల్లో జిల్లా పంచాయతీ వనరుల కేంద్రాలను నిర్మించనున్నట్లు తెలిపారు. రూ.కోటి వ్యయంతో రాష్ట్ర స్థాయి దూర విద్య స్టూడియో ఏర్పాటు, ఇ-కోర్సు మాడ్యూళ్లను రూపొందించనున్నట్లు చెప్పారు. 9 పంచాయతీ లెర్నింగ్ సెంటర్లు (పిఎల్‌సి) ఏర్పాటు చేస్తున్నామన్నారు. సాధికారత, సంస్కరణల సాధనలో రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

మహిళలపై అత్యాచారాలను అరికట్టాలి

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమాజంలో మహిళలు, విద్యార్థినులపై అత్యాచారాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి కోరారు. మహిళలపై అఘాయిత్యాలకు వ్యతిరేకంగా ఏలూరులోని ఫార్మసీ కళాశాలలో సర్ సిఆర్‌రెడ్డి ఫార్మసీ కళాశాల, ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. తొలుత ఫార్మసీ కాలేజీ నుండి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫార్మసీ కళాశాలలో జరిగిన సదస్సులో రమాదేవి మాట్లాడుతూ.. విద్యార్థినులపై అత్యాచారాలను అరికట్టాలని కోరారు. స్త్రీలకు వారు ధరించే దుస్తుల పట్ల అవగాహన కల్పించడం కంటే మహిళల పట్ల పురుషులు వ్యవహరించాల్సిన తీరుపైనే అవగాహన కల్పించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. అశ్లీల సాహిత్యం, వెబ్‌సైట్‌లు అరికట్టాలని డిమాండ్ చేశారు. అత్యాచారాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో అటువంటి వాటికి పాల్పడకుండా చూడాలన్నారు. మహిళా ఎస్ఐ క్రాంతిప్రియ మాట్లాడుతూ ఆపద సమయాల్లో 112 నెంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా విద్యార్థులకు పోలీసు శాఖ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్ ఎం.రాజారామ్మోహన్‌రావు, ఉమెన్ సెల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కెహెచ్.మౌనిక, డాక్టర్ పి.ఉషారాణి, ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.హైమావతి, శ్యామలారాణి, ఐద్వా నాయకులు శారద, ఎం.అరుణ, కస్తూరి పాల్గొన్నారు.

జీతాలు అందక ఇక్కట్లు

- రెవెన్యూశాఖ కాంట్రాక్టు ఉద్యోగుల్లో ఆందోళన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రెవెన్యూశాఖలో కాంట్రాక్టు ఉద్యోగులైన ఇ-డివిజనల్ మేనేజర్స్, (ఐటి విభాగం సాంకేతిక నిపుణులు)కు 18 నెలలుగా జీతాలు అందడం లేదని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇదే విషయంపై రాష్ట్ర ఐటిశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఆయా ఉద్యోగులు వినతిపత్రం ఇచ్చినా తమ శాఖలో తమ జీతాలకు సంబంధించిన ఫైలు ముందుకు కదలడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి తమకు మినిమమ్ టైమ్ స్కేల్ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు పిఎస్ఎల్వి ప్రయోగం

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి బుధవారం పిఎస్ఎల్వి సి-59 రాకెట్ ప్రయోగానికి శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు. షార్‌లోని మొదటి ప్రయోగ వేదికపై ఇప్పటికే అనుసంధానం పనులు పూర్తయ్యాయి. ఈ రాకెట్ ద్వారా యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ప్రోబా-3 మిషన్‌ను ప్రయోగించనున్నారు. ఈ మిషన్‌లో ఒకల్టర్ శాటిలైట్ (ఒఎస్‌సి), కరోనా గ్రాస్ శాటిలైట్ (సిఎస్‌సి) అనే రెండు ఉపగ్రహాలను నింగిలోకి పంపనున్నారు. ఈ రెండు భూమి నుంచి సుమారు 60 వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించనున్నాయి. ఈ ఉపగ్రహాల ద్వారా ఆకాశంలో కృత్రిమ సూర్యగ్రహాన్ని సృష్టించేందుకు, సూర్యుడి యొక్క బాహ్య వలయం కరోనాని అధ్యయనం చేసేందుకు ప్రయత్నం జరగనుంది. కౌంట్‌డౌన్ ప్రక్రియ మంగళవారం మధ్యాహ్నం 2.38 గంటలకు ప్రారంభమై నిరంతరయంగా 25 గంటల 30 నిమిషాల పాటు కొనసాగి బుధవారం సాయంత్రం 4.08 గంటలకు పిఎస్ఎల్వి సి-59ను ప్రయోగించనున్నారు.

సౌదీ బాధితులను తీసుకురావాలి

- విదేశాంగ మంత్రిని కోరిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉపాధి నిమిత్తం విదేశాలకు వలస వెళ్లి, మోసపూరిత యాజమాన్యాల చేతిలో చిక్కుకున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన కార్మికులను తిరిగి స్వదేశానికి తిరిగి తీసుకొచేందుకు కృషి చేయాలని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌ను ఢిల్లీలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. శ్రీకాకుళం జిల్లా నుంచి సౌదీ అరేబియా వెళ్లిన 22 మందిని యాజమాన్యం మోసపూరిత వైఖరితో గత రెండు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతోందని తెలిపారు. కార్మికులను క్షేమంగా స్వదేశానికి తిరిగి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని కోరారు. అలాగే బాధితులకు సత్వర సాయం అందించేలా సౌదీలోని భారత ఎంబసికి సమాచారం అందించాలని విన్నవించారు. దీనిపై జైశంకర్ సానుకూలంగా స్పందించారు.

కాగా సౌదీలో చిక్కుకున్న వారి కుటుంబ సభ్యులకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. బాధితులతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఫోన్‌లో మాట్లాడారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించారని తెలిపారు.


వీడని ఫెంగల్ ఎఫెక్ట్

- తిరుపతి, ఒంగోలులో ఉధృతంగా వాగులు
- వేర్వేరు ఘటనలో ఇద్దరు మృతి - ఒకరు గల్లంతు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఫెంగల్ తుపాను ప్రభావం రాష్ట్రాన్ని వీడడం లేదు. మంగళవారం రాయలసీమ వ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఉమ్మడి చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లోని పలు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందగా, ఒకరు గల్లంతయ్యారు. శనివారం వరకూ రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.

ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడులో పొగాకు, మిర్చి పంటలు నీటమునిగాయి. నాగులుప్పలపాడు-తిమ్మాపురం గ్రామల మధ్య ఉన్న కొత్తకోట వాగు, హనుమాపురం వాగులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. చదలవాడ రామన్న చెరువు కట్ట తెగి 216 జాతీయ రహదారిపై నీరు ప్రవహించడంతో పాటు ఎస్‌టి కాలనీలోకి వర్షపు నీరు చేరింది. బాపట్ల జిల్లా సిఎస్‌పురం మండలం భైరవకోనలో జలపాతం ఉధృతంగా



బాపట్ల జిల్లా సిఎస్‌పురం మండలం భైరవకోనలో ఉధృతంగాప్రవహిస్తున్న జలపాతం

ప్రవహిస్తోంది. పర్యాటకులను నిలుపుదల చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. తిరుమల రెండో ఘాట్‌లో ఐదవ కిలోమీటరు వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో కొంతసేపు వాహనాలకు అంతరాయం కలిగింది. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో తేలికపాటి వర్షం కురిసింది. నంద్యాల జిల్లాలో పలుచోట్ల వరి పంట నేలవాలింది. నెల్లూరు జిల్లా వ్యాప్తంగా సగటును 13 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రహదారులపై వర్షపు నీరు చేరడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న అండర్‌బ్రిడ్జి కిందకు వర్షపు నీరు చేరింది.

తిరుపతి జిల్లా చిట్టమూరు మండల పరిధిలోని కొత్తగుంట గ్రామం చికెన్ షాపులో పనిచేస్తోన్న మధురెడ్డి (45), ఒడిశాకు చెందిన షారూక్ (26) ద్విచక్రవాహనంపై కొత్తగుంట-మల్లం గ్రామాల నడుమ ఉధృతంగా ప్రవహిస్తోన్న వాగును దాటుతుండగా వాహనంతోపాటు ఇద్దరూ కొట్టుకుపోయారు. మధురెడ్డి మృతదేహం లభ్యమవ్వగా షారూక్ ఆచూకీ కోసం అగ్నిమాపక సిబ్బంది గాలిస్తున్నారు. నెల్లూరు జిల్లా సంగం మండలం మర్రిపాడు గ్రామానికి చెందిన చిట్టిబోయిన వెంకటేశ్వర్లు (47) తన భార్య ఆదిలక్ష్మమ్మతో కలిసి తమ పొలంలో వరి నాట్లు వేస్తుండగా పిడుగుపాటుకు వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మరణించారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఉత్సవ నిర్వాహకులు

జనవరి 2 నుంచి విజయవాడ పుస్తక మహోత్సవం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ (విజయవాడ)

విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జనవరి 2 నుంచి 12వ తేదీ వరకు 35వ పుస్తక మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పుస్తక మహోత్సవ సమన్వయకర్త డి విజయకుమార్ వెల్లడించారు. ఈ మేరకు విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు పుస్తక మహోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో విజయకుమార్ మాట్లాడుతూ ఈ ఉత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నిర్వహించిన పుస్తక మహోత్సవాలకు ఎన్‌టిఆర్ ట్రస్ట్ సహకారం అందించిందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, పుస్తక ప్రియుడైన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఈ పుస్తక మహోత్సవానికి సహకారం అందించనున్నారని వివరించారు. బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు కె లక్ష్మయ్య మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాలు మాత్రమే కాదని, సాహిత్యం, కళా రంగాలూ అభివృద్ధి చెందాల్సి ఉందని అన్నారు. ఈ దిశగా ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.

6 నుంచి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భూ దందాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇందులో భాగంగానే తమ ప్రభుత్వం భూ దురాక్రమణ (నిరోధక) చట్టం -2024ను తీసుకొచ్చినట్లు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజల ఆస్తులను లాక్కుంటూ బలవంతంగా భూములు లాక్కుంటున్న వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. కాకినాడ పోర్టులో ప్రధాన వాటాను లాక్కొని అరబిందోకు కట్టబెట్టడం జగన్ అరాచక పాలనకు నిదర్శనమన్నారు. తమ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెవెన్యూ సమస్యలపై 10 వేలకు పైగా ఫిర్యాదులు అందాయన్నారు. ఈ నెల 6 నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సదస్సుల్లో రెవెన్యూ సమస్యలతోపాటు భూ దందాలపైనా ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 17,404 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని, ప్రతి మండలానికి నోడల్ ఆఫీసరుగా డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి వ్యవహరిస్తారని తెలిపారు. గ్రామ స్థాయి టీమ్‌లో సభ్యులుగా తహశీల్దార్, ఆర్‌ఐ, విఆర్‌ఒ, మండల సర్వేయరు, గ్రామ సర్వేయరు, రిజిస్ట్రేషన్ డిపార్టుమెంట్ అధికారి, అవసరాన్ని బట్టి దేవాదాయశాఖ, అటవీశాఖలకు చెందిన ఇతర శాఖల ఉద్యోగి ఉంటారని మంత్రి వెల్లడించారు.

బిసి కార్పొరేషన్లకు నిధులు

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిసి కార్పొరేషన్లకు విధులతోపాటు నిధులు కేటాయిస్తామని బిసి, ఇడబ్ల్యూఎస్ సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రిని ఎమ్మెల్యే అరవింద్‌బాబు, అగ్నికుల క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి సహా ఇతర బిసి సంఘాల నాయకులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బడుగు, బలహీన తరగతుల వారికి రాజ్యాధికారం కల్పించిన ఘనత టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్, సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.39 వేలకోట్లకు పైగా బిసిలకు నిధులు కేటాయించారన్నారు.

బియ్యం తనిఖీకి కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడ యాంకరేజి పోర్టులో గుర్తించిన బియ్యాన్ని సమగ్రంగా తనిఖీ చేసేందుకు ఐదు ప్రభుత్వ శాఖల అధికారులతో కూడిన మల్టీ డిసిప్లినరీ కమిటీ ఏర్పాటు చేశామని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి తెలిపారు. గత నెల 27న కాకినాడ యాంకరేజి పోర్టులో స్టెల్లా ఎల్ నౌకలో నిర్వహించిన తనిఖీల్లో పిడిఎస్ బియ్యాన్ని గుర్తించామన్నారు. ప్రస్తుతం స్టెల్లా ఎల్ షిఫ్ పోర్ట్ కంట్రోల్‌లోనే ఉందని స్పష్టం చేశారు. ఈ బియ్యం గతంలో సీజ్ చేసి బ్యాంకు గ్యారంటీపై రిలీజ్ చేసిన బియ్యమా? లేక పిడిఎస్ నుంచి తరలించిన బియ్యమా? అనేది నిర్ధారణ కావాల్సి ఉందన్నారు. దీని కోసం రెవెన్యూ, పోలీస్, కస్టమ్స్, పౌర సరఫరాలు, పోర్టు అధికారులతో కూడిన మల్టీ డిసిప్లినరీ కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కమిటీ షిప్‌లో ఉన్న మొత్తం బియ్యాన్ని తనిఖీ చేసి నివేదిక ఇస్తుందన్నారు. బ్యాంకు గ్యారంటీ ఇచ్చిన బియ్యం ఎగుమతి చేయొచ్చా? లేదా? అనే అంశంపై లీగల్ ఒపీనియన్ తీసుకుంటున్నామని చెప్పారు. కమిటీ నివేదిక ఆధారంగా ఈ అంశంలో తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దమ్ముకు జిఎస్‌టి పొగ..!

- సిగరేట్, పొగాకుపై 35 శాతం వడ్డన



న్యూఢిల్లీ : దేశంలో సిగరేట్లు, పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని మరింత తగ్గించడానికి వాటిపై భారీగా పన్నులు మోపాలని జిఎస్‌టి కౌన్సిల్ భావిస్తోంది. పన్నురేట్ల హేతుబద్ధీకరణలో భాగంగా ప్రస్తుతం వీటిపై విధిస్తున్న జిఎస్‌టిని 28 శాతం నుంచి 35 శాతానికి పెంచాలని బీహార్ డిప్యూటీ సిఎం సామ్రాట్ చౌదరీ అధ్యక్షతన సమావేశమైన మంత్రుల బృందం నిర్ణయం తీసుకుంది. దీనిపై డిసెంబర్ 21న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆధ్వర్యంలో జరగనున్న జిఎస్‌టి కౌన్సిల్ భేటీలో తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అదే విధంగా దుస్తులపై పన్ను రేట్లను సవరించాలని మంత్రుల బృందం ప్రతిపాదించింది. రూ.1500 వరకు రెడీమేడ్ దుస్తులపై 5 శాతం, రూ.1500- 10,000 మధ్య 18 శాతం, రూ.10,000 పైబడిన దుస్తులపై 28 శాతం జిఎస్‌టి విధించాలని భావించారు. కొత్తగా 148 ఉత్పత్తులపై పన్ను విధించాలని ప్రతిపాదించగా.. వీటిపై జిఎస్‌టి కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం జిఎస్‌టి పన్నుల్లో నాలుగు శ్లాబులు ఉండగా.. కొత్తగా 35 శాతం రేటును కూడా చేర్చాలని జిఒఎం సూచించింది. కొత్త శ్లాబులో పొగాకు, సంబంధిత ఉత్పత్తులతోపాటు శీతలపానియాలు చేర్చాలని పేర్కొంది. ప్రస్తుతం 5, 12, 18,28 శాతం రేట్లలో పన్నులు అమల్లో ఉన్నాయి. లగ్జరీ ఉత్పత్తులైన కార్లు, వాషింగ్ మెషిన్లు, పొగాకు ఉత్పత్తులు 28 శాతం శ్లాబులో ఉన్నాయి.

సిగరెట్‌లు, పొగాకు, సంబంధిత ఉత్పత్తులు, శీతల పానీయాలపై జిఎస్‌టి పెంచనున్నారనే సంకేతాలు మంగళవారం ఆయా రంగాలకు చెందిన పలు షేర్లు మిశ్రమంగా నమోదయ్యాయి. ఐటిసి షేర్లు ఓ దశలో మూడు శాతం నష్టపోగా.. తుదకు 0.97 శాతం తగ్గుదలతో రూ.472.55 వద్ద ముగిసింది. విఎస్‌టి ఇండస్ట్రీస్ షేర్ ఉదయం 2.27 శాతం నష్టపోగా.. తుదకు పుంజుకుని 0.71 శాతం లాభంతో రూ.327.85 వద్ద ముగిసింది. వరుణ్ బేవరేజెస్ కంపెనీ షేరు ఇంట్రాడేలో 5.18 శాతం నష్టపోగా.. తుదకు 1.67 శాతం నష్టంతో రూ.621.70 వద్ద ముగిసింది. మరోవైపు వరుసగా మూడో రోజూ దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 598 పాయింట్లు లాభపడి 80,846కు చేరింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 181 పాయింట్లు పెరిగి 24,457 వద్ద ముగిసింది.

ఎస్‌వియులో మత విద్వేషాలకు తావివ్వొద్దు

- విద్యార్థి సంఘాలు

ప్రజాశక్తి - క్యాంపస్ (తిరుపతి)

శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీలో ఇంజనీరింగ్ ఇఇ విభాగం ప్రొఫెసర్ చెంగయ్యపైన జరిగిన భజరంగ్ దళ్ గూండాల దాడిని ఖండిస్తూ, అలాగే వర్సిటీ తరగతి గదుల్లో అన్యమత ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వర్సిటీ ఇన్‌ఛార్జ్ ఉపకులపతి అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడుకి విద్యార్థి సంఘాలు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశాయి. వర్సిటీలో ప్రొఫెసర్ చెంగయ్య విద్యార్థుల వద్ద మత ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలతో భజరంగ్ దళ్ వారు సోమవారం దాడికి పాల్పడ్డారు.

ఈ నేపథ్యంలో విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ గత 70 సంవత్సరాల యూనివర్సిటీ చరిత్రలో ఏనాడూ లేనివిధంగా యూనివర్సిటీలో మతాల ప్రస్తావన రావడం దారుణమని, బయటి వ్యక్తులు వర్సిటీ ప్రొఫెసర్ల మీద దాడి చేయడం వర్సిటీ ప్రతిష్టకు భంగం వాటిల్లేలా ఉందని అన్నారు. కొందరు ప్రొఫెసర్లు ప్రభుత్వం దగ్గర జీతాలు తీసుకుంటూ తరగతి గదిలో అన్యమత ప్రచారాలు చేయడం ఏమాత్రమూ సరికాదని, ఇకపై మతాలకు సంబంధించిన కార్యక్రమాలకి వర్సిటీలో ఎటువంటి అనుమతులూ ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు చిన్న, అక్బర్, రవి, ఆర్కే నాయుడు, రామ్మోహన్, అశోక్, మల్లికార్జున, శివశంకర్ నాయక్, మహేంద్ర నాయక్, రంజిత్, అశోక్, బషీర్, రాజు, వినోద్ ,భార్గవ్ ,తదితరులు పాల్గొన్నారు. కాగా వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో సోమవారం జరిగిన ఘటనలపై వర్సిటీ ఉపకులపతి ఆచార్య అప్పారావు విచారణకు ఆదేశించారు.

9న డిమాండ్స్ డే : సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు ఈ నెల 9న 'డిమాండ్స్ డే'గా నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. అదాని గ్రూపు కంపెనీల అవినీతి, తప్పిదాలు, క్రోనీ క్యాపిటలిజాన్ని ప్రోత్సహించడంలో కేంద్ర ప్రభుత్వ పాత్రపై దర్యాప్తు చేయడం కోసం సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. అధిక ధరలను అరికట్టాలని, నిరుద్యోగాన్ని నిర్మూలించాలని కోరారు. జిడిపి తగ్గిపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై 9న 'డిమాండ్స్ డే'ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్‌బిఐకి చేరని రూ.6,839 కోట్ల విలువైన పెద్ద నోట్లు



ముంబయి : రూ.2,000 నోట్లను ఉపసంహరించుకుని ఏడాదిన్నర గడుస్తున్నప్పటికీ ఇంకా రూ.6,839 కోట్ల విలువ చేసే పెద్ద నోట్లు తమ ఖజానకు చేరలేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) తెలిపింది. 2023 మే 19న రూ.2000 నోట్ల చలామణిని ఆర్‌బిఐ నిలిపివేసిన విషయం తెలిసిందే. నవంబర్ ముగింపు నాటికి 98.08 శాతం నోట్లు మాత్రమే ఆర్‌బిఐకి చేరాయి. ఇంకా రూ.6,839 కోట్ల విలువైన రూ.2వేల నోట్లు రావాల్సి ఉందని పేర్కొంది. గతేడాది అక్టోబర్ వరకు మాత్రమే ఈ నోట్లను బ్యాంక్‌లు స్వీకరించాయి. ఆ తర్వాత దేశవ్యాప్తంగా ఉన్న 19 ఆర్‌బిఐ కార్యాలయాల్లో మాత్రమే వీటిని తీసుకుంటున్నారు. నల్లధనంకు అవకాశం కల్పిస్తున్నాయని 2016లో మోడీ సర్కార్ పెద్ద నోట్ల పేరుతో రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేసిన విషయం తెలిసిందే. వాటి స్థానంలో మరింత పెద్ద నోటు రూ.2,000ను తీసుకొచ్చింది.

వివేకా పిఎ ఫిర్యాదు కేసులో పది మందికి నోటీసులు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్యకేసులో ఆయన పిఎ వెంకట కృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసుల దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసుకు సంబంధించి పది మందికి నోటీసులు జారీ చేశారు. కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు గత ఏడాది డిసెంబర్ 15న వివేకా కుమార్తె సునీత, ఆయన అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, సిబిఐ ఎస్‌పి రాంసింగ్‌లపై పులివెందుల పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును తిరిగి విచారణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో పులివెందుల పోలీసులు మరోసారి విచారణ చేపట్టారు. ఈ నెల ఐదున విచారణకు రావాలని పది మందికి పులివెందుల డిఎస్‌పి మురళీనాయక్ సిఆర్‌పిసి 160 కింద నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న వారిలో వైఎస్.మనోహర్‌రెడ్డి, వైఎస్.అభిషేక్‌రెడ్డి, ఇసి.సురేంద్ర నాథ్‌రెడ్డి, వైఎస్ఆర్ ట్రస్టు ఛైర్మన్ జనార్ధన్‌రెడ్డి, న్యాయవాది ఓబుల్‌రెడ్డి ఉన్నారు. వీరు కాకుండా మరో ఐదుగురు సాక్షులకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. వీరంతా గురువారం ఉదయం పది గంటలకు పులివెందుల డిఎస్‌పి కార్యాలయానికి రావాలని నోటీసులో పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి వివేకా పిఎ కృష్ణారెడ్డి వాంగ్మూలాన్ని ఇప్పటికే డిఎస్‌పి మురళీనాయక్ నమోదు చేశారు. తాజాగా మరో పది మందిని విచారించేందుకు నోటీసులు ఇచ్చారు.

సంపాదకీయం


డాలర్ కల్లలు

డాలర్ పెత్తనానికి అడ్డుకట్ట వేసి ప్రత్యామ్నాయ కరెన్సీ మార్పిడి వ్యవస్థ వైపు బ్రిక్స్ దేశాలు అడుగులేయడం అమెరికాకు గుబులు పుట్టిస్తోంది. ఇంత కాలం తన ప్రపంచాధిపత్యానికి ఒక సాధనంగా ఉన్న డాలర్ పెత్తనానికి బ్రిక్స్ కూటమి నుంచి మొదటిసారి సవాల్ ఎదురవడంతో అగ్ర రాజ్యం ఉక్రోషంతో ఊగిపోతోంది. అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన ట్రంప్ గత వారం చేసిన హూంకరింపులు, బెదిరింపుల్లో ఇది స్పష్టంగా ప్రతిబింబిస్తున్నది. బ్రిక్స్ దేశాలపై చిందులు వేయడానికి రెండు రోజుల ముందు తెంపరి ట్రంప్ ఇరుగు పొరుగు దేశాలైన మెక్సికో, కెనడాలపై ఇదే విధంగా హూంకరించాడు. సరిహద్దుల గుండా అమెరికాలోకి ఈ రెండు దేశాలు వలసలను ఎగదోస్తున్నాయని, వాటిని ఆపకపోతే ఆ రెండు దేశాలపై 25 శాతం చొప్పున సుంకాలు విధిస్తానని బెదిరించాడు. అంతేకాదు చైనాపై ఇప్పుడున్న సుంకాలకు అదనంగా మరో పది శాతం విధిస్తానని హూంకరించాడు కూడా. ఇటువంటి బెదిరింపులకు భయపడేది లేదని, మీ ఊరికి మా వూరు ఎంత దూరమో, మా ఊరికి మీ వూరు కూడా అంతే దూరమని గుర్తుంచుకోవాలని ట్రంప్‌ను హెచ్చరించాయి. మెక్సికో, కెనడా సరిహద్దుల గుండా అమెరికాలోకి అక్రమంగా వలసలు వచ్చేవారిలో చాలావరకు కాయకష్టం చేసుకునే శ్రామికులు. వారి శ్రమే లేకుంటే అమెరికాకు ఒక్క పూట కూడా గడవదు. అసలు అమెరికా సౌధమే బానిసల శ్రమ పునాదులపై లేచిందన్న చారిత్రిక సత్యాన్ని ట్రంప్ ఉద్దేశపూర్వకంగానే విస్మరిస్తున్నారు.

2008లో తలెత్తిన మహా ఆర్థిక మాంద్యం తరువాత అమెరికా ప్రపంచాధిపత్యం బీటలువారనారంభించింది. దానిని నిలబెట్టుకోవడం కోసం డాలర్ కేంద్రంగా ఉన్న కరెన్సీమార్పిడి వ్యవస్థ స్విఫ్ట్‌ను అగ్ర రాజ్యం ఒక రాజకీయ సాధనంగా చేసుకుంటోంది. తద్వారా తన మాట వినని వెనిజులా, రష్యా వంటి దేశాల ఆస్తులను స్తంభింపజేస్తూ, వ్యాపార వాణిజ్య కార్యకలాపాలను నియంత్రించడం వల్లే 'బ్రిక్స్' దేశాలు ప్రత్యామ్నాయం వైపు దృష్టి సారించాల్సి వచ్చింది. పశ్చిమ దేశాల ఆధిపత్యంలోని సొసైటీ ఫర్ వరల్డ్ వైడ్ ఇంటర్ బ్యాంక్ ఫైనాన్షియల్ టెలి కమ్యూనికేషన్ (స్విఫ్ట్)కు ప్రత్యామ్నాయంగా 'బ్రిక్స్ బ్రిడ్జి' ని ఇటీవల కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సు తెరపైకి తీసుకొచ్చింది. దీనికి బ్రిక్స్‌లోని రష్యా, చైనా, బ్రెజిల్, దక్షిణాఫ్రికాతో బాటు కొత్తగా సభ్యులుగా చేరిన ఇండొనేషియా, ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పూర్తి మద్దతు తెలిపాయి. బ్రిక్స్‌లో సభ్యత్వం కోసం క్యూ కడుతున్న వెనిజులా, అర్జెంటీనా వంటి మరో 35 దేశాలు కూడా 'బ్రిక్స్ బ్రిడ్జి'కే మద్దతు తెలిపాయి. ఈ దేశాలు... ప్రపంచ జనాభాలో దాదాపు సగం, జిడిపిలో 35 శాతానికిపైగా ప్రాతినిధ్యం వహిస్తున్నాయి.

ఈ వాస్తవికతను పశ్చిమ దేశాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. 50 ఏళ్ల క్రితం డాలర్లలో చమురు విక్రయాలు జరిపేందుకు సౌదీ అరేబియాతో కుదుర్చుకున్న 'పెట్రో డాలర్' ఒప్పందం అమెరికాకు అపారమైన లబ్ధి చేకూర్చింది. రెండో ప్రపంచ యుద్ధానంతరం కుదిరిన ఈ ఒప్పందాన్ని ఆసరాగా చేసుకుని చమురు సంపన్నమైన పశ్చిమాసియాపై పెత్తనం చెలాయించింది. ఆ దేశాల ఆంతరంగిక వ్యవహారాల్లో తలదూర్చింది. డాలర్ పెత్తనాన్ని ప్రశ్నించిన దేశాలను ఆర్థిక ఆంక్షలతో ముప్పుతిప్పలు పెట్టింది. తాజాగా ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాను బలహీనపరిచేందుకు స్విఫ్ట్‌ను ఒక సాధనంగా ఉపయోగించింది. దీని నుంచి బయటపడేందుకు పుతిన్ చైనా, భారత్ వంటి దేశాలతో సొంత కరెన్సీలో వాణిజ్యం నిర్వహించారు. దీంతో రష్యాపై అమెరికా ఆంక్షలు బెడిసికొట్టాయి. ఇప్పుడు ట్రంప్ చేస్తున్న సుంకాల బెదిరింపు కూడా బెడిసికొట్టక మానదు. ఇతర దేశాలపై సుంకాలు పెంచడం వల్ల దిగుమతులు తగ్గిపోతాయి. దీంతో అమెరికన్లకు చౌకగా వస్తున్న విదేశీ ఉత్పత్తులు ఇకపై చాలా ఖరీదవుతాయి. ఇది అమెరికాలోని మధ్య తరగతిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇప్పటికే బ్రిక్స్ దేశాలతో అమెరికా వాణిజ్య లోటు 43,350 కోట్ల డాలర్లకు చేరింది. అంతేకాదు, మెషినర్ల నుంచి ఔషధాలు, అరుదైన ఖనిజాల కోసం అమెరికా బ్రిక్స్ దేశాలపైనే ఆధారపడుతోంది. ఏ విధంగా చూసినా ఈ సుంకాల పెంపు బ్రిక్స్ దేశాల కంటె అమెరికాకే ఎక్కువ నష్టం వాటిల్లుతుంది. ఈ విషయాన్ని ట్రంప్ గుర్తెరిగి వ్యవహరిస్తే మంచిది.

మహనీయుల మాట



సమాజ పురోగతిని మహిళల సామాజిక స్థితిగతులను బట్టి అంచనా వేయగలం.
- కారల్ మార్క్స్



ప్రజా ప్రభాతం

సోషలిజం - సుప్రీం కోర్టు వ్యాఖ్యలు



> ప్రధాన న్యాయమూర్తి ఉత్పత్తి సాధనాలను సమాజపరం చేయకుండానే అందరికీ సమాన అవకాశాలను గ్యారంటీ చేయవచ్చునని సూచిస్తున్నారు. వాస్తవానికి సోషలిజం అన్నది కేవలం ఒక సంక్షేమ రాజ్యాన్ని నిర్మించడం అన్న లక్ష్యంతో మాత్రమే పరిమితం కాదు. దాని లక్ష్యం అంతకన్నా చాలా విస్తృతంగా ఉంటుంది. సమాజంలోని తక్కిన మానవులతో సంబంధాలన్నీ తెగిపోయి ఒంటరిగా మిగిలిపోయే వ్యక్తులతో నిండిన, ముక్క చెక్కలైన పరిస్థితిని పెట్టుబడిదారీ వ్యవస్థ కల్పిస్తుంది. ఆ పరిస్థితిని అధిగమించి ఒక నూతన సమాజాన్ని నిర్మించడం సోషలిజం లక్ష్యం.



ప్రభాత్ పట్నాయక్

రాజ్యాంగ పీఠిక నుండి 'సోషలిజం' అన్న పదాన్ని తొలగించాలని కోరుతూ సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్ మీద నవంబరు 22న జరిగిన విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి రెండు వ్యాఖ్యలు చేశారు. అవి ప్రాధాన్యత కలిగినవి. మొదటిది: రాజ్యాంగ పీఠికలో 'సోషలిజం' అన్న పదాన్ని ఒక సైద్ధాంతిక పరమైన ప్రాతిపదిక నుండి ఉపయోగించలేదని, అది ఒక సంక్షేమ రాజ్యాన్ని సూచించేదిగా, పౌరులందరికీ సమాన అవకాశాలను గ్యారంటీ చేసే అర్ధంలో ఉపయోగించారని అన్నారు. రెండవది: ఈ అర్ధంలో సోషలిజం అనేది రాజ్యాంగ మౌలిక పునాదిలో అంతర్భాగంగా ఉంటుందని, ఏదో అదనంగా తోడు చేసిన పదంగా దానిని పరిగణించకూడదని, భారతీయ గణతంత్ర సమాజం ఏ విధంగా ఉండాలో దాని సారాంశంతో సోషలిజం అన్న పదం పెనవేసుకుని వుందని ఆయన అన్నారు.

సోషలిజం అన్న పదానికి ఒక వ్యవస్థీకృత అర్ధాన్ని ఇవ్వడానికి ప్రధాన న్యాయమూర్తి సంసిద్ధులు కాలేదు. ప్రపంచం మొత్తం మీద 'సోషలిజం' అన్న పదాన్ని ఉత్పత్తి సాధనాలను, - కనీసం కీలకమైన ఉత్పత్తి సాధనాలను సమాజ ఉమ్మడి ఆస్తిగా ఉంచడం అన్న అర్ధంలో వాడతారు. కాని ప్రధాన న్యాయమూర్తి ఆ అర్ధంలో కాకుండా, ఫలితం ప్రాతిపదికగా సోషలిజాన్ని నిర్వచించారు. ప్రైవేటు సంస్థలు మనుగడలో ఉండడం (అంటే ఉత్పత్తి సాధనాలు ప్రైవేటు ఆస్తిగా ఉండడం) అనేది సోషలిజానికి ఏవిధంగానూ ఆటంకం కాబోదని, ఎవరి ఆస్తి అన్నదానితో నిమిత్తం లేకుండా పౌరులందరికీ సమాన అవకాశాలను గ్యారంటీ చేయగలిగే సంక్షేమ రాజ్య స్థాపనే ముఖ్యం అన్నది దాని భావం.

ఉత్పత్తి సాధనాల యాజమాన్యం ఎవరిది అన్న దానిని బట్టి సోషలిజాన్ని ఒక వ్యవస్థీకృత ప్రాతిపదికన నిర్వచించడం సర్వత్రా ఉంది. అందరికీ సమాన అవకాశాలను గ్యారంటీ చేయాలంటే ముందు ఉత్పత్తి సాధనాలు సమాజపరం అవడం అవశ్యంగా జరగాలన్న అవగాహనతోటే ఆ విధంగా జరుగుతోంది. ఐతే ప్రధాన న్యాయమూర్తి ఉత్పత్తి సాధనాలను సమాజపరం చేయకుండానే అందరికీ సమాన అవకాశాలను గ్యారంటీ చేయవచ్చునని సూచిస్తున్నారు. వాస్తవానికి సోషలిజం అన్నది కేవలం ఒక సంక్షేమ రాజ్యాన్ని నిర్మించడం అన్న లక్ష్యంతో మాత్రమే పరిమితం కాదు. దాని లక్ష్యం అంతకన్నా చాలా విస్తృతంగా ఉంటుంది. సమాజంలోని తక్కిన మానవులతో సంబంధాలన్నీ తెగిపోయి ఒంటరిగా మిగిలిపోయే వ్యక్తులతో నిండిన, ముక్క చెక్కలైన పరిస్థితిని పెట్టుబడిదారీ వ్యవస్థ కల్పిస్తుంది. ఆ పరిస్థితిని అధిగమించి ఒక నూతన సమాజాన్ని నిర్మించడం సోషలిజం లక్ష్యం. అటువంటి నూతన సమాజం అందరికీ సమాన అవకాశాలను గ్యారంటీ చేయగలిగి వుండడం కూడా అవశ్యంగా జరగాలి.

ఉత్పత్తి సాధనాలను సమాజపరం చేయకుండా అటువంటి సంక్షేమ రాజ్యాన్ని నిర్మించడం సాధ్యమేనా అన్నది ఇక్కడ ప్రశ్న.

అది సాధ్యం కాదు అని మనం విశ్వసిస్తున్నాం. కాని, ఉత్పత్తి సాధనాలు ప్రైవేటు ఆస్తిగా ఉండడానికి, సమాన అవకాశాలను గ్యారంటీ చేయగలగడానికి మధ్య ఉన్న వైరుధ్యాన్ని ఇప్పుడు చర్చనీయాంశంగా చేయబోవడం లేదు. ప్రధాన న్యాయమూర్తి ప్రకటించినట్టుగా రాజ్యం పౌరులందరికీ సమాన అవకాశాలను గ్యారంటీ చేయగలగాలన్న అంశానికే సుప్రీం కోర్టు కట్టుబడి ఆ ప్రకారం నడుచుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. సమాన అవకాశాలు అందరికీ ఉండే సమాజం ఏవిధంగా ఉండాలో పరిశీలించాలని కోరుతున్నాం.

ప్రస్తుతం భారత సమాజంలో ఒకపక్క సంపద కేంద్రీకరణ, మరొక పక్క నిరుద్యోగం, పౌష్టికాహారాన్ని సైతం పొందలేకపోతున్నంతగా పేదరికం పెరుగుతున్న పరిస్థితి ఉంది. అందుచేత మన సమాజం అందరికీ సమాన అవకాశాలను కల్పించే దిశగా నడుస్తోందని ఎవరూ వాదించలేరు. మరి ఆ దిశగా నడుస్తోందని నిర్ధారించడానికి పరిగణనలోకి తీసుకోవలసిన సూచికలేమిటి?

నిరుద్యోగం లేదా మార్క్స్ చెప్పినట్టు శ్రామికుల రిజర్వు సైన్యం ఉన్నప్పుడు సమాజంలో సమాన అవకాశాలు ఉండవన్నది స్పష్టం. ఒకవేళ నిరుద్యోగులకు భృతి కల్పించినా, ఆ నిరుద్యోగుల ఆదాయాలకు, కార్మికుల ఆదాయాలకు మధ్య తేడా ఎక్కువగానే ఉంటుంది. ఆ నిరుద్యోగుల సంతానం సైతం ఏమీ పొందలేని స్థితిలో ఉంటారు. వారికి, కార్మికుల సంతానానికి మధ్య సమాన అవకాశాలు గ్యారంటీ చేయడం అసాధ్యం.

నిరుద్యోగం వల్ల ఏర్పడే ఆర్థిక అసమానతే కాకుండా నిరుద్యోగిగా ఉండడం అనేదే సమాజంలో ఒక శాపంగా పరిగణించబడే స్థితిలో, ఆత్మ గౌరవాన్నే కోల్పోయిన ఆ నిరుద్యోగుల సంతానం చిన్నతనం నుండే గాయపడ్డ మనస్సులతో జీవితాన్ని ప్రారంభిస్తారు. అటువంటి పరిస్థితిని నివారించాలంటే, సమాన అవకాశాలను కల్పించాలంటే ముందు నిరుద్యోగాన్ని లేకుండా చేయాలి.

> ప్రధాన న్యాయమూర్తి ప్రకటించినట్టుగా రాజ్యం పౌరులందరికీ సమాన అవకాశాలను గ్యారంటీ చేయగలగాలన్న అంశానికే సుప్రీం కోర్టు కట్టుబడి ఆ ప్రకారం నడుచుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. సమాన అవకాశాలు అందరికీ ఉండే సమాజం ఏవిధంగా ఉండాలో పరిశీలించాలని కోరుతున్నాం.

ఆర్థిక లేమిని తొలగించాలంటే అందుకు ఒక మార్గం నిరుద్యోగ భృతిని కూడా కార్మికులు పొందే వేతనంతో సమానంగా చెల్లించడం. కాని ప్రైవేటు సంస్థలు ఉండే వ్యవస్థలో ఇది అసాధ్యం. ప్రైవేటు రంగం గణనీయంగా కొనసాగే సమాజంలో- అది కేవలం పెట్టుబడిదారీ వ్యవస్థే కానక్కరలేదు- నిరుద్యోగం ఉండడం అనేది కార్మికులను అదుపులో ఉంచే సాధనంగా ఉంటుంది. అందుచేత అటువంటి ఆర్థిక వ్యవస్థల్లో నిరుద్యోగులకు ఇచ్చే భృతి కార్మికులకు ఇచ్చే వేతనాలతో సమానంగా ఉండడం ఆమోదయోగ్యం కాజాలదు. సమానంగా ఉంటే అప్పుడు నిరుద్యోగం కార్మికులను అదుపులో ఉంచే సాధనంగా ఉండలేదు. పూర్తి స్థాయి ఉపాధి కల్పన జరిగిన సమాజంలో ఒక కార్మికుడిని పని నుండి తొలిగించడం అనేది ఒక శిక్షగా ఉండలేదు. ప్రైవేటు సంస్థలు కొనసాగడానికి, సమాన అవకాశాలు గ్యారంటీ చేయాలన్న లక్ష్యానికి మధ్య ఉన్న మొట్టమొదటి వైరుధ్యం నిరుద్యోగం విషయం లోనే. ఈ విషయాన్ని ప్రధాన న్యాయమూర్తి అంగీకరించక పోయినప్పటికీ, సమాన అవకాశాలను గ్యారంటీ చేయడానికి నిరుద్యోగం ఆటంకం అని గుర్తించక తప్పదు.

సమాన అవకాశాలను గ్యారంటీ చేయాలంటే పరిగణించాల్సిన రెండో అంశం ఆస్తి వారసత్వాన్ని పూర్తిగా గాని దాదాపుగా కాని లేకుండా చేయడం. వారసత్వ హక్కు కొనసాగుతున్నప్పుడు ఒక శతకోటీశ్వరుడి కుమారుడు, ఒక కార్మికుడి కుమారుడు సమాన అవకాశాలను కలిగివున్నట్టు చెప్పలేం కదా. ఆ శతకోటీశ్వరుడి కుమారుడికి అప్పుడు ఆ కోట్లాది సంపద సంక్రమిస్తుంది. వాస్తవానికి బూర్జువా ఆర్థిక శాస్త్రం కూడా వారసత్వ హక్కును సమర్థించలేదు. పెట్టుబడిదారులకు తక్కినవారికన్నా అదనంగా కొన్ని ప్రత్యేక సామర్థ్యాలు ఉన్నందువల్లే వారికి లాభాలు సమకూరుతాయన్న ప్రాతిపదికన అది పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థిస్తుంది. దానివల్ల పోగుబడే సంపద మీద హక్కు అటువంటి ప్రత్యేక సామర్థ్యంతో నిమిత్తం లేకుండా వారసత్వంగా ఆ పెట్టుబడిదారుడి సంతానానికి సంక్రమించడాన్ని ఏవిధంగా సమర్థించగలుగుతుంది? అందువల్లే చాలా పెట్టుబడిదారీ దేశాల్లో వారసత్వ పన్ను రేటు చాలా ఎక్కువగా ఉంటుంది. జపాన్‌లో అత్యధికంగా 55 శాతం ఉంటే, తక్కిన దేశాల్లో 40 శాతం దాకా ఉంది. కాని ఆశ్చర్యకరంగా భారతదేశంలో వారసత్వ పన్నే లేదు. మరి సమాన అవకాశాల కల్పనకు ఆస్కారం ఎక్కడుంటుంది?

ఇక సమాన అవకాశాలు కల్పించడానికి తేల్చాల్సిన మూడవ అంశం సంపద అసమానతలను కనీస స్థాయికి తీసుకురావడం. సంపద అంటే అధికారం. అందులో రాజకీయ అధికారమూ ఉంటుంది, సామాజిక అధికారమూ ఉంటుంది. ఈ అధికారం సమానంగా పంపిణీ అయినప్పుడే సమాజంలో అందరికీ సమాన అవకాశాలను కల్పించినట్టు అవుతుంది. సంపన్నుల సంతానం తమ తల్లితండ్రుల జీవిత కాలంలో సమాజంలో తక్కిన వారి సంతానం కన్నా పైచేయి కలిగి వుండే పరిస్థితులుంటే సమాన అవకాశాల కల్పన అసాధ్యం అవుతుంది. అందుచేత తల్లిదండ్రుల అనంతరం వారసత్వంగా సంపద మీద హక్కు పొందే వీలును లేకుండా చేస్తే సరిపోదు, ఆ తల్లిదండ్రుల జీవిత కాలంలో కూడా వారి వద్దనున్న సంపద కారణంగా ఇతరుల కన్నా పైచేయి కలిగివుండే స్థితిని కూడా మార్చాలి. అంటే సంపదలో అసమానతలను తొలగించాలి. సంపదలో అసమానతలను తొలగించడంతోబాటే ఆదాయాల్లో అసమానతలను కూడా కనిష్ట స్థాయికి తేవాలి. అప్పుడు మాత్రమే సమాన అవకాశాలను అందరికీ గ్యారంటీ చేయడం సాధ్యం.

ఇక నాల్గవది: ఆర్థిక అసమానతల కారణంగా విద్య, నైపుణ్యం పొందే విషయంలో అందరికీ ఒకే విధమైన అవకాశాలు లేకుండా పోయే పరిస్థితి ఉండకూడదు. అంటే అందరికీ విద్య, నైపుణ్యం పొందేందుకు సమాన అవకాశాలను కల్పించాలి. ఇది ప్రభుత్వ విద్యా వ్యవస్థను పెంపొందించి అందరికీ నాణ్యత కలిగిన విద్యను ఉచితంగా కాని, నామక: ఖర్చుతో గాని అందుబాటులో ఉంచాలి. ఇప్పుడు నయా ఉదారవాద వ్యవస్థలో విద్య దాదాపు ప్రైవేటీకరించబడింది. దీని వలన సమాన అవకాశాలు అన్న లక్ష్యమే అర్థం లేనిదిగా మారిపోయింది. అత్యధిక విద్యార్థులు నాణ్యత కలిగిన చదువుకు అంతకంతకూ దూరం అయిపోతున్నారు. ఒకపక్క ప్రభుత్వ విద్యా వ్యవస్థ కొనసాగుతున్నా, ఖరీదైన ప్రైవేటు విద్యావ్యవస్థ ఇంకోపక్కన ఉన్నందున, అది ఒక బూటకపు ప్రతిష్టను సంతరించుకున్నందున, ఆ ప్రైవేటు విద్యా సంస్థల నుండే అధికంగా ఉపాధి కల్పన అవకాశాలు లభిస్తున్నందున సమాన అవకాశాల కల్పన అనేది అసాధ్యం అయిపోతున్నది. దీనిని నివారించాలంటే ఆ ప్రైవేటు సంస్థలు కూడా ప్రభుత్వ సంస్థలతో సమానంగా ఫీజులు వసూలు చేయాల్సిందేనన్న నిబంధనలు పెట్టాలి. దానర్థం అవి దాతృత్వ సంస్థలుగా మాత్రమే పని చేయాలి.

మరి అయిదవది: ఇది వైద్య, ఆరోగ్య కల్పనకు సంబంధించినది. ఇక్కడ కూడా విద్యకు వర్తించిన సూత్రాలే వర్తించాలి. సార్వత్రిక, నాణ్యతతో కూడిన ఆరోగ్య సంరక్షణ కల్పించినప్పుడే సమాన అవకాశాల కల్పన సాధ్యం. ఇది జరగాలంటే జాతీయ వైద్య సంరక్షణ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడవాలి. అక్కడ ఉచితంగా కాని, నామమాత్రపు రుసుముతో గాని అందరికీ వైద్యం అందాలి.

పౌరులందరికీ సమాన అవకాశాలు గ్యారంటీ కావాలంటే పైన సూచించినవి కొన్ని కనీస అవసరాలు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత కాలంలో సంక్షేమ రాజ్య వ్యవస్థను సోషల్ డెమోక్రసీ చేపట్టి కీన్స్ సిద్ధాంతానికి అనుగుణంగా నిరుద్యోగాన్ని కనీస స్థాయిలో ఉంచింది (1960 దశకంలో బ్రిటన్‌లో నిరుద్యోగం 2 శాతం మాత్రమే ఉండేది). అయినప్పటికీ ఆ వ్యవస్థ పౌరులందరికీ నిజమైన అర్ధంలో సమాన అవకాశాలను గ్యారంటీ చేయలేకపోయింది. అంతేకాక ఆ విధానాన్ని దీర్ఘకాలంపాటు కొనసాగించలేకపోయింది (1960, 1970 దశకాల్లో తలెత్తిన ద్రవ్యోల్బణ సంక్షోభాన్ని అది తట్టుకోలేకపోయింది. దాంతో అది కుప్పకూలింది). వర్గాలుగా చీలివున్న సమాజంలో అందరికీ సమాన అవకాశాలను గ్యారంటీ చేయడం అసాధ్యం అని ఆ సంక్షేమ రాజ్య అనుభవం నేర్పుతున్నది.

వలస విధానం అంతమైన తర్వాత పెట్టుబడిదారీ దేశాలకు ముడి సరుకుల మీద పెత్తనం లేకుండా పోయింది. దాని వలన ఆ దేశాలలో వర్గ వైరుధ్యాలు తీవ్రమయ్యాయి. దాని పర్యవసానంగా తీవ్ర స్థాయిలో ద్రవ్యోల్బణం పెరిగింది. అటువంటి వర్గ వైరుధ్యాలు లేని సమాజంలో మాత్రమే, అంటే ఉత్పత్తి సాధనాలు ప్రైవేటు ఆస్తిగా కాకుండా సమాజపు ఉమ్మడి ఆస్తిగా ఉన్నప్పుడు మాత్రమే నిజమైన అర్ధంలో అందరికీ సమాన అవకాశాలు కల్పించడం సాధ్యం.

ఐతే ఇప్పుడు ఈ విషయం మీద చర్చ లేవనెత్తడం కన్నా అందరికీ సమాన అవకాశాలను కల్పించే సంక్షేమ వ్యవస్థ ఉండాలన్న సుప్రీం కోర్టు వైఖరికే అది కట్టుబడి వుండాలని కోరుకుందాం. ఆ దిశగా ముందుకు పడే అడుగులు సోషలిజం దాకా వెళ్ళకపోయినప్పటికీ, ఏ మేరకు పడినా అది సోషలిస్టులందరూ స్వాగతించాల్సిందే.

(స్వేచ్ఛానుసరణ)

సమస్య

అదాని ఆడింది ఆట.. సెకి పాడిందే పాట..

> అదాని, సెకి మధ్య పిపిఎ పత్రం ఇప్పటికీ బహిరంగం కాలేదు. ఇలాంటి పద్ధతుల్లో పిపిఎలు, పిఎస్‌ఎలు చేసుకుంటే వివాదాలకు తావుంటుంది. పిపిఎ లోని షరతుల ప్రకారం భవిష్యత్‌లో అదాని అదనపు క్లెయిమ్‌లు చేసే అవకాశం వుంటుంది. డిస్కాములపై అదనపు భారాలు పడే అవకాశాలు వుంటాయి. వాస్తవానికి, ఎన్‌టిపిసి ద్వారా రాయలసీమలో సోలార్ పార్కులలో నెలకొల్పిన ప్రాజెక్టుల నుండి సౌర విద్యుత్ కొనుగోలుకు డిస్కాంలు చేసుకున్న ఇలాంటి పిఎస్‌ఎలలో వివాదాలు తలెత్తి, కేసులు నడుస్తున్నాయి.



ఎం. వేణుగోపాలరావు



రాష్ట్ర ప్రభుత్వం, డిస్కాములు 2021 డిసెంబరు మొదటి తేదీన సెకితో పిఎస్‌ఎ చేసుకున్న తరువాతనే సెకి అదాని ఎనర్జీ, అజూర్‌లతో పిపిఎలు చేసుకుంది. ఆ పిపిఎలను చేసుకున్నాక వాటి కాపీలను 30 రోజులలో డిస్కాంలకు, రాష్ట్ర ప్రభుత్వానికి సెకి ఇవ్వాలని పిఎస్‌ఎలో పొందుపరిచారు. ఆ పిపిఎలు పిఎస్‌ఎలో అంతర్భాగం అవుతాయని పిఎస్‌ఎలో (ఆర్టికల్ కె) పొందుపరిచారు. పిపిఎలో పొందుపర్చిన విధంగా అదాని, అజూర్‌కు సెకి పాటించాల్సిన బాధ్యతలను సెకికి యథాతథంగా డిస్కాంలు నెరవేర్చాలని పిపిఎలో (ఆర్టికల్ ఒ) పొందుపరిచారు. ఇలాంటి షరతుల వల్ల కొన్ని అంశాలు స్పష్టం అవుతున్నాయి. అదాని, అజూర్‌లతో సెకి పిపిఎలు చేసుకోవటానికి ముందే, అవి పిఎస్‌ఎలో అంతర్భాగం అవటం అంటే, రాష్ట్ర ప్రభుత్వం, డిస్కాంలు ఆ పిపిఎలలో భాగస్వాములు కావటమే. సెకి ద్వారా సౌర విద్యుత్ కొనుగోలు వ్యవహారంలో అదానితో రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదన్న వాదన అర్థరహితం, అవాస్తవం. పిపిఎలోని సెకి బాధ్యతలను డిస్కాంలు నెరవేర్చటం అంటే, ఆ బాధ్యతలేమిటో, వాటి పర్యవసానాలు ఏమిటో పరిశీలించకుండానే ఏకపక్షంగా, ముందే అంగీకరించటమే. అజూర్‌తో సెకి చేసుకున్న పిపిఎ కూడా తరువాత అదానికి బదిలీ అయ్యింది.

పిపిఎని ఎపిఈఆర్‌సికి గాని, సిఇఆర్‌సికి గాని సెకి, డిస్కాములు సమర్పించలేదు. దానికి సిఇఆర్‌సి ఆమోదాన్ని కోరలేదు. సెకిని మధ్యలో విద్యుత్ సేకరణదారు (ఇంటర్‌మీడియరీ ప్రొక్యూరర్) అని పిఎస్‌ఎలో పేర్కొన్నారు. టెండరు షరతులను మార్చేందుకు అనుమతిస్తూ, స్పష్టీకరణలు ఇస్తూ కేంద్ర నూతన, పునరుత్పత్తి ఇంధన మంత్రిత్వ శాఖ పలుమార్లు లేఖలు, నోటిఫికేషన్లు జారీ చేసింది. ఇవన్నీ అదాని గ్రూపునకు అనుచిత లబ్ధి చేకూర్చటానికి ఉద్దేశించినవే. వాటి ప్రాతిపదికన అదానికి అనుగుణంగా సెకి చేసిన టెండరు షరతులలో మార్పులు చెల్లుతాయని వాదించారు. ఆ ప్రకారం అదానికి సెకి చెల్లించాల్సిన రేటును 2022 ఏప్రిల్ 2న జారీ చేసిన ఉత్తర్వులో నిర్ధారించింది. కేంద్ర మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలు, వివరణల ప్రకారం ఆ మార్పులు చెల్లుతాయని పేర్కొంది. సిఇఆర్‌సి ఆ విధంగా ఆమోదం తెలిపింది గనుక, ఆ మార్పులన్నీ న్యాయపరంగా చెల్లుతాయని ఆ ఒప్పందం సమర్ధకులు వాదించవచ్చుగాని, అవన్నీ అదానీకి అనుచిత లబ్ధి చేకూర్చడానికి దారితీసినవనే వాస్తవాన్ని అవి మరుగుపర్చజాలవు. సిఇఆర్‌సిలో సెకి దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రతివాదులుగా ఉన్న ఎపిడిస్కాములు, రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్లు కూడా దాఖలు చేయకుండా, వాదనలు చేయకుండా మౌనం పాటించడం గమనార్హం. అంటే, సెకి ఈ పిటిషన్‌లో కోరిన వాటిపై తమకేమీ అభ్యంతరాలు లేవని అవి అంగీకరించినట్లయింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, టిడిపి నాయకుడు, ప్రస్తుత ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఆ పిటిషన్‌లో లేవనెత్తిన అభ్యంతరాలను సిఇఆర్‌సి తోసిపుచ్చింది. వారిద్దరూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లపై వచ్చే తీర్పుకు లోబడి తమ ఉత్తర్వులు ఉంటాయని సిఇఆర్‌సి, ఎపిఈఆర్‌సి పేర్కొన్నాయి.

పిఎస్‌ఎకు ఆమోదం కోరుతూ డిస్కాంలు ఎపిఈఆర్‌సిలో దాఖలు చేసిన పిటిషన్‌కు జతచేసిన పత్రాలలో సెకి, అదాని మధ్య చేసుకున్న పిపిఎ కాపీని చేర్చలేదు. పిపిఎ పిఎస్‌ఎలో అంతర్భాగం అవుతుందని పిఎస్‌ఎలో పొందుపర్చినప్పటికి, ఆ పిపిఎకి సిఈఆర్‌సి ఆమోదం పొందనప్పటికి, ఎపిఈఆర్‌సి ఆ పిఎస్‌ఎకు 2024 ఏప్రిల్ 20వ తేదీన ఇచ్చిన ఉత్తర్వులో ఆమోదం తెలిపింది. కమిషన్ పరిశీలన చేసిన తరువాత పిఎస్‌ఎ లోని షరతులన్నీ ప్రామాణిక ఫార్మాట్‌లకు అనుగుణంగా ఉన్నాయని, అవి అన్యాయమైనవి కావని, సమ్మతమం లేనివి కావని, ఏ స్టేక్‌హోల్డర్ల ప్రయోజనాలను దెబ్బతీయటం లేదని ఎపిఈఆర్‌సి ఉత్తర్వులో అభిప్రాయపడింది. ఎపిఈఆర్‌సి ఆ పిటిషన్‌పై ప్రజల నుండి అభ్యంతరాలను కోరలేదు. బహిరంగ విచారణలు జరపలేదు. ఏకపక్షంగా ఆమోదం తెలిపింది. పిఎస్‌ఎలో అంతర్భాగంగా చూపబడినా, పిపిఎ లోని షరతులను కమిషన్ పరిశీలించిన దాఖలాలు లేవు. కమిషన్ ఉత్తర్వులో వాటి ప్రస్తావన కూడా లేదు. కమిషన్ ఆమోదం లేకుండా పిఎస్‌ఎలో అమలులోకి రాదని పేర్కొన్న ఎపిఈఆర్‌సి, సంబంధిత కమిషన్ ఆమోదం లేకుండా పిపిఎ అమలు లోకి వస్తుందా, అది పిఎస్-ఎలో అంతర్భాగమవుతుందా అనే అంశాన్ని పరిశీలించలేదు, స్పష్టం చేయలేదు. అదాని, సెకి మధ్య పిపిఎ పత్రం ఇప్పటికీ బహిరంగం కాలేదు.

ఇలాంటి పద్ధతుల్లో పిపిఎలు, పిఎస్‌ఎలు చేసుకుంటే వివాదాలకు తావుంటుంది. పిపిఎ లోని షరతుల ప్రకారం భవిష్యత్‌లో అదాని అదనపు క్లెయిమ్‌లు చేసే అవకాశం వుంటుంది. డిస్కాములపై అదనపు భారాలు పడే అవకాశాలు వుంటాయి. వాస్తవానికి, ఎన్‌టిపిసి ద్వారా రాయలసీమలో సోలార్ పార్కులలో నెలకొల్పిన ప్రాజెక్టుల నుండి సౌర విద్యుత్ కొనుగోలుకు డిస్కాంలు చేసుకున్న ఇలాంటి పిఎస్‌ఎలలో వివాదాలు తలెత్తి, కేసులు నడుస్తున్నాయి.

విద్యుత్ కొనుగోలుకు దీర్ఘకాలిక కాంట్రాక్టు కింద ట్రేడింగ్ మార్జిన్‌ను (ఇక్కడ సెకీకి ఇచ్చే కమిషన్) డిస్కాములు, విద్యుత్ అమ్మకందారు పరస్పర అంగీకారంతో నిర్ణయించుకోవాలని ట్రేడింగ్ లైసెన్సు రెగ్యులేషన్ పేర్కొంటున్నది. అయినప్పటికి, డిస్కాంలు అలాంటి ప్రయత్నం చేసి సెకి కమిషన్‌ను తగ్గించడానికి ఒప్పించే ప్రయత్నం చేసిన దాఖలాలు లేవు. సౌర విద్యుత్ ఉత్పత్తిదారులకు సెకి ఎస్క్రో అకౌంటు లేదా లెటర్ ఆఫ్ క్రెడిట్ ఏర్పాటు చేయటంలో విఫలమైతే, ట్రేడింగ్ మార్జిన్‌ను యూనిట్‌కు 2 పైసలకు పరిమితం చేయాలని రెగ్యులేషన్‌లో పేర్కొన్నారు. సెకి, డిస్కాముల మధ్య కుదిరిన పిఎస్‌ఎలో ఐఎస్‌టిఎస్ చార్జీలు, అంతర్రాష్ట్ర ప్రసార నష్టాలకు మినహాయింపు ఇస్తున్న కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు అంతర్భాగమని పేర్కొన్నారు. అయితే, ఆ మినహాయింపులను పొందాల్సిన బాధ్యత ఎవరిదనేది స్పష్టం చేయలేదు. అదాని సౌర విద్యుత్ కొనుగోలు వ్యవహారమంతా....ఆశ్రిత పెట్టుబడిదారి విధానంతో మోడీ ప్రభుత్వ అండతో...అదాని ఆడింది ఆట, సెకి పాడిందే పాటగా, రాష్ట్ర ప్రభుత్వం, డిస్కాంలు, నియంత్రణ కమిషన్‌లు వాటికి వంత పాటగా నడిచింది.

/ వ్యాసకర్త విద్యుత్ రంగ నిపుణులు /

కవిత్వం

మట్టి పిడికిళ్లు!

గంగిగోవులు గాండ్రిస్తున్నాయి
అన్నం ముద్దలు నిప్పురవ్వలై
ఎగసిపడుతున్నాయి
మట్టి చేతులు గట్టి పిడికిళ్ల బిగిస్తున్నాయి
దేశపు తలరాత రాసే అన్నదాత
కొంపాగోడూ వదలి అన్నం నీళ్ల మాని
ఆక్రోశంతో అందరికీ పిలుపిస్తున్నాడు
వ్యవసాయ చట్టాల చిట్టా పట్టుకొని
ఇంద్రప్రస్థానికి తరలి వస్తూ
పరిహారం, ప్రయోజనాలిచ్చే
ఐదు ప్రధాన డిమాండ్లు కోరుతూ
అణగారిన ఆశల్ని తట్టి లేపుతున్నాడు
భవిష్యత్ భారతాన్ని అంధకారంలోకి
నెట్టొద్దంటూ హెచ్చరిస్తూ
దూసుకొస్తున్నాడు
కాకుల్ని కొట్టి గద్దలకు పెట్టే
దిక్కుమాలిన పాత చట్టాలకు పాతరేసి
కష్టానికి చట్టబద్ధత కల్పించి
నవభారతాన్ని లిఖించేందుకు
కలసి కట్టై నడుం కడుతున్నాడు
ప్రభుత్వంలో చలనం
ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు
దేశ రాజధాని సమీపాన ఘర్మజల
నదులన్నీ
కట్టలు తెగి కలిసి పొంగుకొస్తున్నాయ్.

- భీమవరపు పురుషోత్తమ్,
రాజమండ్రి,
సెల్ : 9949800253.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps @ gmail.com

యుపిలో రైతులపై ఉక్కుపాదం

● 200 మంది అరెస్టు ● ఎస్‌కెఎం ఖండన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉత్తరప్రదేశ్‌లో భారీ ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతులు తమకు న్యాయమైన పరిహారం చెల్లించాలని కోరినందుకు యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం పోలీసులతో దాడి చేయించింది. బలవంతంగా మహిళలను, రైతులను అరెస్టు చేసింది. మూకుమ్మడిగా జైలుకు పంపింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్వయంగా వచ్చి సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నేతలతో చర్చలు జరుపుతారని హామీ ఇచ్చిన కొన్ని గంటల్లోనే బిజెపి ప్రభుత్వం తన మోసపూరిత వైఖరిని ప్రదర్శించింది. మంగళవారం తెల్లవారుజామున ఢిల్లీ సరిహద్దుల్లోని అంబేద్కర్ పార్క్‌లోని రైతుల ఆందోళన కేంద్రంపై పోలీసులు దాడికి పూనుకున్నారు. మహిళలతో సహా దాదాపు 200 మందిపై నిర్బంధకాండను ప్రయోగించి, జైల్లో పెట్టారు. వీరిలో ఎక్కువ మంది మహిళలే ఉన్నారని అఖిల భారత కిసాన్ సభ నేత పుష్పేందర్ త్యాగి తెలిపారు. సోమవారం రాత్రి ప్రదర్శన చేసిన గ్రేటర్ నోయిడాతో సహా పలు ప్రాంతాల రైతులు తాత్కాలికంగా తమ ఇళ్లకు తిరిగి వెళ్లడంతో పెద్ద సంఖ్యలో పోలీసులు నిరసన కేంద్రాన్ని మోహరించి దాడి చేశారు. గాయపడిన మహిళలకు తగిన చికిత్స అందించకుండా జైలులో పెట్టారు. ఆలిండియా కిసాన్ సభ గ్రేటర్ నోయిడా జిల్లా ఉపాధ్యక్షులు గాబ్రి ముఖ్యను పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. పోలీసులు ఎలాంటి విధివిధానాలు పాటించకుండా దాడికి యత్నించారు. గౌతంబుద్ధనగర్ గ్రామాల్లో నేతలను గృహ నిర్బంధం చేశారు. గ్రామాల్లో బెదిరింపులకు పాల్పడటంతోపాటు ఆందోళన కేంద్రానికి రైతులు రాకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. బుధవారం ఆందోళన కేంద్రం వద్దకు చేరుకోవాలని రైతులు నిర్ణయించారు.



ఢిల్లీలో మహిళలను, రైతులను అరెస్టు చేస్తున్న యుపి పోలీసులు

విజయం సాధించే వరకు పోరాటం

పోలీసుల దౌర్జన్యాన్ని ఖండిస్తూ విజయం సాధించే వరకు పోరాడతామని, ఆదిత్యనాథ్ బెదిరింపులకు తలొగ్గమని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ప్రకటించింది. శాంతియుతంగా నిరసన తెలిపే రాజ్యాంగ హక్కును ఆదిత్యనాథ్ ప్రభుత్వం నిరాకరించిందని, ఇందులో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాలని ఎస్‌కెఎం కోరింది. ఆదిత్యనాథ్ ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి ఆందోళనను అణచివేసేందుకు ప్రయత్నిస్తుందని పేర్కొంది. సోమవారం సాయంత్రం రెవెన్యూ, పోలీసు అధికారులతో చేసుకున్న ఒప్పందాన్ని బాహాటంగా ఉల్లంఘించిందని విమర్శించింది. ఏడు రోజుల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్వయంగా వచ్చి చర్చలు జరుపుతారని హామీ ఇచ్చారని, అంబేద్కర్ పార్కుకు తరలివెళ్లిన రైతులపై పోలీసులు దాడులు చేస్తున్నారని పేర్కొంది. అంతిమ విజయం సాధించే వరకు రైతులు ఐక్యంగా నిలబడతారని ఎస్‌కెఎం ఒక ప్రకటనలో తెలిపింది.

వెంటనే విడుదల చేయాలి : ఏఐకెఎస్

బిజెపి ప్రభుత్వాన్ని రైతులు కదిలించారని ఈ పోలీసుల చర్య ద్వారా స్పష్టమైందని ఆలిండియా కిసాన్ సభ (ఏఐకెఎస్) పేర్కొంది. ఈ మేరకు ఏఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూకృష్ణన్ ప్రకటన విడుదల చేశారు. అరెస్టు చేసిన వారందరినీ బేషరతుగా వెంటనే విడుదల చేయాలని, రైతులతో చర్చల తేదీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పోలీసుల చర్య, అరెస్టులు రైతులను మభ్యపెట్టే ప్రయత్నం చేసిందని విమర్శించారు. ఇలాంటి బెదిరింపు వ్యూహాలు రైతులను పోరాడకుండా అడ్డుకోబోవని హెచ్చరించారు. ఎఐకెఎస్‌తో పాటు ఇతర సంఘాలతో కలిసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని, డిమాండ్లన్నీ సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

దక్షిణ కొరియాలో సైనిక పాలన



● అధ్యక్షుడి ప్రకటన

సియోల్ : ప్రతిపక్షం ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ దేశంలో అత్యవసర సైనిక పాలన విధిస్తున్నట్లు దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ మంగళవారం ప్రకటించారు. పార్లమెంట్‌ను నియంత్రించడానికి ప్రయత్నిస్తోందని, ఉత్తర కొరియా పట్ల సానుభూతితో వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వ వ్యతిరేక చర్యలతో ప్రభుత్వాన్ని స్తంభింపచేయడానికి చూస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. దేశ ప్రజలనుద్దేశించి టెలివిజన్‌లో ప్రసంగిస్తూ యూన్ ఈ ప్రకటన చేశారు. ఉత్తర కొరియా అనుకూల శక్తులను సమూలంగా నిర్మూలిస్తానని ప్రతిన చేశారు. రాజ్యాంగ ప్రజాస్వామిక వ్యవస్థను పరిరక్షిస్తానని హామీ ఇచ్చారు. ఈ చర్యతో దేశ పాలన ఏ విధంగా ప్రభావితమవుతుందో ఇంకా స్పష్టం కాలేదు. ఈ ప్రకటనకు ఆయన స్వంత కన్జర్వేటివ్ పార్టీ నేతలతో సహా పలువురు రాజకీయ నాయకుల నుండి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇవన్నీ తప్పుడు నిర్ణయాలని సొంత పార్టీ నేత వ్యాఖ్యానించారు. ఇది అక్రమ, రాజ్యాంగ విరుద్ధ నిర్ణయాలు, చర్యలని ప్రతిపక్ష నేత లీ జా మియాంగ్ విమర్శించారు. ఈ మార్షల్ లా విధించడం వల్ల కొరియా రిపబ్లిక్ పునర్నిర్మాణం, రక్షణ సాధ్యమవుతుందని యూన్ చెప్పారు.

నాగమణి హత్యను ఖండించిన కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కులాంతర వివాహం చేసుకున్నందుకు కానిస్టేబుల్ నాగమణిని హత్య చేసిన ఆమె సోదరుడు పరమేష్‌ను తక్షణమే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. నాగమణి హత్యను సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఖండించారు. తెలంగాణలోని ఇబ్రహీంపట్నం మండలం రాయపోలుకు చెందిన నాగమణి నవంబర్ 10న శ్రీకాంత్ అనే దళిత యువకుడిని కులాంతర వివాహం చేసుకుందన్నారు. తక్కువ కులం వాడిని పెళ్లి చేసుకోవడమే కాకుండా, ఆస్తిలో వాటా తీసుకుంటుందనే అక్కసుతో సోదరుడు ఈ దారుణానికి పాల్పడ్డట్లు చెప్పారు. గతంలో రాష్ట్రంలో చిత్తూరు, కర్నూలు, గుంటూరు జిల్లాల్లో ఇటువంటి సంఘటనలు వెలుగుచూశాయన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతోపాటు, దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రోత్సాహం కరువైందన్నారు.

బంధువులకు మావోయిస్టు మృతదేహాలు అప్పగింత

● మల్లయ్య భౌతికకాయాన్ని నిలిపివేసిన పోలీస్‌శాఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చెల్పాకలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టుల మృతదేహాలను మంగళవారం సాయంత్రం వారి బంధువులకు అప్పగించారు. సోమవారం ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రిలో కాకతీయ మెడికల్ కళాశాల ఫోరెన్సిక్ నిపుణులు ఏడు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. వారిలో ఏనుగోలు మల్లయ్య మృతదేహాన్ని బంధువులకు ఇవ్వకుండా నిలిపివేశారు. అతని మృతిపై అనుమానం ఉందని మల్లయ్య భార్య మీనా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే మల్లయ్య మృతదేహాన్ని గురువారం వరకు ఆస్పత్రిలోనే భద్రపర్చాలని కోర్టు ఆదేశాలు జారీచేసింది. మిగిలిన ఆరు మావోయిస్టుల మృతదేహాలు ఛత్తీస్‌గఢ్‌కు చెందినవి కావడంతో వారి కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. సోమవారం రాత్రి వరకు ఆస్పత్రికి వద్ద వేచి ఉన్నా కోర్టులో పిటిషన్ ఉండటంతో మంగళవారం వరకు మావోయిస్టు కుటుంబ సభ్యులు వేచి ఉండకతప్పలేదు. ఎలాంటి అభ్యంతరాలు లేకుంటే మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని మంగళవారం కోర్టు ఆదేశాలు జారీ చేయగా భారీ బందోబస్తు మధ్య అప్పగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా ములుగు డిఎస్‌పి రవీందర్, ఏటూరునాగారం సిఐ అనుముల శ్రీనివాస్, స్పెషల్ పార్టీ బందోబస్తు చేపట్టారు. మల్లయ్య అలియాస్ మధు మృతిపై అనుమానాలుండటంతో పిటిషన్ వేశామని, హైకోర్టు గురువారం వరకు ఇక్కడే భద్రత పర్చాలని ఆదేశాలు ఇచ్చిందని భార్య మీనా తెలిపారు. గాంధీ ఆస్పత్రి ఫోరెన్సిక్ నిపుణులతో పోస్టుమార్టం చేయించాలని కోరామన్నారు. నిపుణులు అందుబాటులో లేకపోవడం, ఇతర కారణాల దృష్ట్యా గురువారం వరకు మృతదేహాన్ని తీసుకెళ్లడం లేదని తెలిపారు.



మావోయిస్టు మృతదేహాలను అప్పగిస్తున్న పోలీసులు

ఉపాధి హామీ కార్డుల తొలగింపులో కేంద్రం పాత్ర లేదు : శివరాజ్‌సింగ్ చౌహాన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉపాధి హామీ జాబ్ కార్డుల తొలగింపులో కేంద్ర ప్రభుత్వ పాత్ర ఏమీ లేదని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ పేర్కొన్నారు. మంగళవారం లోక్‌సభలో డిఎంకె ఎంపి టిఆర్ బాలు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. వేతనాల కోసం ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ తప్పనిసరి చేయడంతో జాబ్ కార్డ్ తొలగింపుల మధ్య ఎటువంటి సంబంధం లేదని అన్నారు. పారదర్శకతను నిర్ధారించడానికి మాత్రమే ఆధార్ సీడింగ్ జరిగిందని పేర్కొన్నారు.

కేంద్ర మంత్రి ఇచ్చిన లెక్కల ప్రకారం.. ఉపాధి హామీకి కేటాయింపులు 2020-21లో రూ.1,11,500 కోట్లు కాగా, 2021-22లో రూ.98,000 కోట్లకు తగ్గించారు. 2022-23లో రూ.86,400 కోట్లకు తగ్గించారు. 2023-24లో రూ.86,000 కోట్లకు తగ్గించారు. 2024-25 ప్రస్తుత బడ్జెట్ అంచనాల్లో రూ.86,000 కోట్లు ప్రకటించినప్పటికీ, సవరించిన అంచనాల్లో తగ్గే అవకాశం ఉంది. గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఉపాధి హామీ పథకానికి రికార్డు స్థాయిలో ఖర్చు చేసిందని, కరోనా సమయంలో ఖర్చును స్వల్పంగా తగ్గించిందని లోక్‌సభలో తెలిపారు. మంత్రి చెప్పిన తప్పుడు లెక్కలను నిరసిస్తూ.. ప్రతిపక్ష సభ్యులు ఆందోళన చేశారు. నిధుల మంజూరులో జాప్యం జరిగిందన్న ఎంపి టిఆర్ బాలు వాదనలపై స్పందించిన మంత్రి, కేంద్రం ఇస్తున్న వేతనం సరిపోదని ఏ రాష్ట్రమైనా భావిస్తే, అదనంగా కొంత మొత్తం కలిపి ఇవ్వవచ్చునని చెప్పారు.

ఏక్‌నాథ్ షిండేతో ఫడ్నవీస్ భేటీ

ముంబయి : మహారాష్ట్ర అపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేతో బిజెపి నాయకుడు దేవేంద్ర ఫడ్నవీస్ మంగళవారం సాయంత్రం భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి అధికారిక నివాసం 'వర్షా'లో ఈ సమావేశం జరిగింది. ఈ నెల 5న రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. అనారోగ్యంతో బాధపడుతున్న షిండే థానేలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఇంటికి చేరుకున్న గంటల వ్యవధిలోనే ఫడ్నవీస్‌తో ఆయన సమావేశమయ్యారు.

నేడు కొత్త ముఖ్యమంత్రి ప్రకటన

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడై పది రోజులైనా మహాయుతి కూటమి ఇంకా ముఖ్యమంత్రిని ఎన్నుకోని సంగతి తెలిసిందే. బుధవారం జరిగే బిజెపి ఎమ్మెల్యేల సమావేశంలో లెజిస్లేటివ్ పార్టీ నేతను ఎన్నుకుంటారని, ఆయనే సిఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని సమాచారం. ఈ నెల 5న ప్రమాణస్వీకార కార్యక్రమం కోసం అజాద్ మైదాన్‌లో చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి.

నివేదికలివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ (పిఎంఎవై-జి), ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పిఎం-జన్‌మన్) పథకాలను ప్రస్తుత యూనిట్ విలువతో కొనసాగించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న గృహాలను పూర్తి చేయడానికి చేసిన ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదించింది.

మరికొన్ని నిర్ణయాలు

ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి), గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్స్(జిసిసి) పాలసీ 2024-2029 మంత్రి మండలి ఆమోదం. (బహుళ జాతి సంస్థలు (ఎంఎన్‌సిలు) విదేశాల్లో ఏర్పాటు చేసే కేంద్రాలు రిమోట్ వర్క్, హైబ్రిడ్ వర్క్, కో వర్కింగ్ స్పేస్ లాంటి అత్యాధునిక సర్వీస్‌డెలివరీ మోడళ్లను ఏర్పాటు చేయడం ఈ పాలసీ లక్ష్యం)

ఎపి టెక్స్ టైల్ అపెరల్ అండ్ గార్మెంట్స్ పాలసీ -4.0కి ఒమంత్రి మండలి ఆమోదం. ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో (పిపిపి) 5 కొత్త సమగ్ర టెక్స్ టైల్ పార్కుల అభివృద్ధికి ఆమోదం.

ఆంధ్రా బోర్డు ఆఫ్ ఆయుర్వేదాన్ని ఇకపై ఆంధ్రప్రదేశ్ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్‌గా పిలవాలని నిర్ణయించారు. ఆంధ్రాబోర్డు ఫర్ హోమియోపతిని ఇకపై ఆంధ్రప్రదేశ్ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఫర్ హోమియోపతిగా పిలవాలని మంత్రి వర్గం నిర్ణయించింది.

ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ పాలసీ -4.0కి మంత్రి మండలి ఆమోదం.

ఆంధ్రప్రదేశ్ క్రీడల పాలసీ 24-29కి సవరణలకు ఆమోదం.

ఆంధ్రప్రదేశ్ టూరిజం పాలసీ 24-29 సమగ్ర వెర్షన్‌కు మంత్రి మండలి ఆమోదం.

ఆంధ్రప్రదేశ్ సస్టైనబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ -4.0కి ఆమోదం.

ఆర్‌టిజిఎస్ (రియల్ టైమ్ గవర్నెర్స్) -4.0కి ఆమోదం.





మీకోసం

స్టీలు గ్లాసులు ఒకదాంట్లో ఒకటి ఇరుక్కుపోయి ఇబ్బంది పెట్టినప్పుడు పై గ్లాసులో చల్లటి నీళ్లు పోసి కింది గ్లాసును వేడినీళ్లలో పెట్టాలి. అప్పుడు సులభంగా కింది గ్లాసు ఊడి వస్తుంది.

జీవన సౌరభం

ఒక వ్యక్తి గుణగణాలు పరీక్షించాలి అంటే అతనికి అధికారం ఇచ్చి చూడాలి.

కప్ప తెలివి




ఒక అడవిలో పులి ఉంది. ఒకరోజు దానికి బాగా ఆకలి వేసింది. ఎంతసేపు వెదికినా ఏ ఆహారం దొరకలేదు. అలా వెళ్తుండగా చెరువు కనిపించింది. తిండి ఎలాగూ లేదు, కనీసం చెరువులో నీళ్లైనా తాగి కాసేపు ఓపిక పడదామని తలవంచింది. చెరువులో దానికి ఒక కప్ప కనిపించింది. పులికి ప్రాణం లేచి వచ్చింది. కప్పను పట్టుకోబోయింది. భయంతో ఉన్న కప్ప చెరువులోకి దూకబోయి, గట్టుపైకి ఎగిరింది. ఈసారి ఇంకా భయంతో వణికిపోయింది. అయితే వెంటనే తేరుకుని 'ఓ పులి రాజా, మీరు అడవికి రాజైతే, నేను ఈ చెరువుకు రాజుని. ఇద్దరమూ సమానమే. మనిద్దరి హోదాలు ఒకటే. కాబట్టి మీరు నన్ను తినకూడదు' అని లేని ధైర్యాన్ని తెచ్చుకుని పులితో గప్పాలు పలికింది. అప్పుడు పులి 'నేనే ఈ అడవికి రాజును. నీకెంత ధైర్యం ఉంటే, నువ్వే రాజునని అంటున్నావు' అని కోపంగా గాండ్రించింది. ఈసారి కప్ప భయంతో బిక్కచచ్చిపోయింది. ఎలాగైనా పులి నుండి తప్పించుకోవాలని ఉపాయం ఆలోచించింది. 'మనిద్దరం సమానమంటే మీరు ఒప్పుకోవడం లేదు. కాబట్టి పరుగుపందెం పెట్టుకుందాం. అందులో మన శక్తిసామర్థ్యాలు తెలుస్తాయి. అప్పుడైనా మీకు అర్థమవుతుంది' అని ఈసారి కాస్త స్వరం తగ్గించి చెప్పింది కప్ప.

కప్ప అలా అనడంతోనే పులి 'నాతో నీకు పోటీనా? తెలివి తక్కువ కప్పా.. అయితే, నాతో పరుగెత్తు..'' అంటూ పరుగు లంకించుకుంది. ఇదే అదను అనుకుని కప్ప వెంటనే నీళ్లల్లో దూకేసింది. బతుకుజీవుడా అనుకుంటూ నీళ్లలోకి జారిపోయింది.



- కందుల శ్రవణ్,
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
కడవేర్గు గ్రామం,
సిద్ధిపేట జిల్లా, తెలంగాణ.



జత చేయండి

పిల్లలూ! ఇక్కడ రకరకాల జీవులు ఉన్నాయి. ఎదురుగా వాటి నివాసాలు ఉన్నాయి. వేటికి ఏది సరైనదో గుర్తించి జత చేయండి.

నేను గీసిన బొమ్మ





డొక్క హరి ప్రసాద్,
6వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్,
నిజాంపేట.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

చలికాలంలో పిల్లల రక్షణ ఇలా...



శీతాకాలం (చలికాలం)లో పిల్లల నుంచి పెద్దల వరకూ అందరికీ అనారోగ్య సమస్యలు వస్తూనే ఉంటాయి. ఈ కాలపు వాతావరణం పిల్లల ఆరోగ్యంపై ఎంతో ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా ఈ కాలంలోనే పిల్లల రోగ నిరోధక శక్తి క్షీణించి వారి ఆరోగ్యం సన్నగిల్లుతుంది. ఫలితంగా వారు చురుగ్గా కాకుండా నీరసంగా ఉంటారు. అనేక సీజనల్ సమస్యలకు లోనవుతారు. సరైన ఆహారం తీసుకోకపోవటం వల్ల శరీరం బ్యాక్టీరియా, జెమ్స్‌తో పోరాడే రోగనిరోధక శక్తిని కోల్పోతుంటారు. పిల్లలైనా, పెద్దలైనా చలికాలంలో సరైన డైట్ పాటించటం చాలా ముఖ్యం. అంతేకాక ఆహారపు అలవాట్లలో కొన్ని రకాల మార్పులు చేయటం తప్పనిసరి కూడా. పిల్లలు తీసుకునే ఆహారంలో తగినన్ని పోషకాలు, విటమిన్లు, మినరల్స్ ఉండేలా శ్రద్ధ తీసుకోవాలి. ఆకుకూరలు తినటం ద్వారా అధికమొత్తంలో పోషకాలు, విటమిన్లు ఉంటాయి. పాలకూర, మెంతికూర, ఉల్లికాడలు, తాజా వెల్లుల్లిని పిల్లల ఆహారంలో చేర్చటం వల్ల వారికి ఎక్కువ మొత్తంలో పైటో న్యూట్రీయెంట్స్, విటమిన్లు, మినరల్స్‌ను అందించొచ్చు. ఆకుకూరలతోపాటు పప్పు కూడా తినిపిస్తే మరిన్ని ఎక్కువ పోషకాలు శరీరానికి అందుతాయి.

ఎక్కువగా దగ్గు, జ్వరం, జలుబు వంటివి పీడిస్తుంటాయి. ఈకాలంలో వైరస్, బ్యాక్టీరియా సులభంగా వ్యాప్తి చెందుతాయి. మరీ ముఖ్యంగా చిన్న పిల్లలు జబ్బుల బారిన పడుతుంటారు. రాబోయే మూడు నెలలు చలి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ క్రమంలో పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రధానంగా కేంద్రీకరించాలి. రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే పిల్లల ఆరోగ్యంపై ఈ కాలంలో ప్రత్యేక శ్రద్ధ అవసరం. ఈ కాలంలో ఎలాంటి ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం.

దుస్తులు : పిల్లలను తీవ్రమైన చలి నుంచి రక్షించి వారి శరీరం వెచ్చగా ఉండేలా పెద్దలు జాగ్రత్త తీసుకోవాలి. అందుకే ఉన్ని స్వెట్టర్లు తప్పనిసరిగా వేయాలి. చలి తీవ్రత ఎక్కువగా ఉంటే చేతులకు గ్లవ్స్, కాళ్లకు సాక్స్ వేయాలి. బయటకు వెళ్తే బూట్లు ఉండేలా చూడాలి. పిల్లల శరీరానికి నేరుగా చల్లగాలి తగలకుండా చూసుకోవాలి. పిల్లల శరీరంలో వెచ్చదనం తగ్గితే జ్వరం వచ్చే రిస్క్ పెరుగుతుంది. జలుబు, దగ్గు లాంటివి వస్తాయి. సీజన్ మారినప్పుడు వాతావరణంలో వచ్చే మార్పులు పిల్లలకు ఇబ్బంది కలిగిస్తాయి. పిల్లల ముఖం, శరీరంపై సూక్ష్మక్రిములు దాడి చేస్తాయి. అందువల్ల పిల్లలకు డ్రెస్ విషయంలో ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖం, శరీరం మొత్తం కప్పి ఉంచే డ్రెస్ వెయ్యాలి. చలి తగలకుండా.. వెచ్చదనం ఉండేలా చెయ్యాలి. ఫుల్ స్లీవ్స్, మంకీ క్యాప్స్, ఫుల్ లెంగ్త్ పాంట్స్ వాడాలి.

పరిశుభ్రత : పిల్లల గది, ఆడుకునే ప్రదేశాలు, చదువుకునే ప్రదేశం అన్నీ పరిశుభ్రంగా ఉండేలా చూడాలి. పిల్లలు ఎక్కువగా ఇండోర్స్‌లోనే ఉంటారు కాబట్టి ప్రతి రోజూ ఇల్లు పరిశుభ్రంగా ఉంచాలి. పిల్లలకు వాడే బట్టలు, సాక్స్, స్కూల్ బ్యాగ్స్, బొమ్మలు అన్నీ పొడిగా, శుభ్రంగా ఉండాలి.

సరైన ఆహారం : పిల్లలకు ఏడాదంతా పౌష్టికాహారం అందించడం అత్యవసరం. తినే ఆహారంపైనే వారి ఇమ్యూనిటీ ఆధారపడి ఉంటుంది. అందువల్ల వ్యాధి నిరోధక శక్తిని పెంచే ఆహారం ఎక్కువగా ఇవ్వాలి. పాలు, పండ్లు, గుడ్లు, కూరగాయలు, ఆకు కూరలను ఎక్కువగా ఇవ్వాలి. పిల్లలు పాఠశాల నుంచి వచ్చిన తర్వాత అల్పాహారం తీసుకునే ముందు చేతులు, కాళ్లు బాగా కడగాలి. విటమిన్ సి, ఐరన్, జింక్ వంటి మినరల్స్ అధికంగా ఉన్న ఆహారాన్ని అందిస్తే రోగ నిరోధక శక్తి పెంపొందుతుంది. పండ్లు, కూరగాయలు, గోధుమలు, నాటు గుడ్లు వంటివి ఇందులో చేర్చాలి.

నీరు : చలికాలంలో చర్మం త్వరగా పొడిబారిపోతుంది. సాధారణంగా ఎక్కువగా దాహం వేయదు. అందుకే పిల్లలు ఎక్కువ నీరు తాగరు. తగినంత నీరు తాగకపోతే చలికాలంలో శ్వాసకోశ ఇబ్బందులు ఏర్పడతాయి. జలుబు, దగ్గు వచ్చే రిస్క్ పెరుగుతుంది. శరీరంలోని వ్యర్థాలు బయటికి వెళ్లటం కష్టమవుతుంది. అందువల్ల పిల్లలతో నీరు బాగా తాగిస్తూ ఉండాలి. నీరు చర్మాన్ని తేమగా ఉంచి.. బ్యాక్టీరియాతో పోరాడేలా చేస్తుంది. నీటి వల్ల శరీరం.. విష వ్యర్థాలను బయటకు పంపేందుకు వీలవుతుంది. చలి కాలంలో శరీరానికి చెమట ఎక్కువగా పట్టనందున పిల్లలు తక్కువ నీరు తాగుతుంటారు. వారితో ఎక్కువ నీరు తాగించాలి. వీలైనంత వరకు గోరువెచ్చని నీరు అందించాలి.

నిద్ర : చలికాలంలో పిల్లలు బాగా నిద్రపోయేలా చెయ్యాలి. తద్వారా వారి ఇమ్యూనిటీ బాగా పెరుగుతుంది. శారీరకంగా కూడా పిల్లలు ఎదిగేందుకు నిద్ర చాలా అవసరం. రోజూ కనీసం 7 గంటలైనా పడుకునేలా చెయ్యండి.

టీకాలు వేయించాలి

ఇన్‌ఫ్లుయెంజా వ్యాక్సిన్‌తో పిల్లలకు దగ్గు, జలుబు, జ్వరం రాకుండా ఉంటుంది. వీటిని ఏడాది పిల్లలకు రెండుసార్లు వేస్తారు. ఆ తర్వాత ఐదేళ్ల వరకు ఏటేటా ఒక్కొక్కటి చొప్పున తీసుకోవాలి. సీజనల్ టీకాలు వేయించాలి.

సొంత వైద్యం సరికాదు

చలి కాలంలో చిన్నపిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. వాతావరణంలోని మార్పులు, చల్లని గాలులతో పిల్లలకు జ్వరంతోపాటు శ్వాసకోస సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఒక్కోసారి జలుబు అధికమైతే పిల్లలకు ఆయాసం వచ్చే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో వెంటనే వైద్యులను సంప్రదించాలి. సాధారణంగా జబ్బు చేసిన ప్రతిసారీ వారికి యాంటీబయాటిక్ ఇస్తుంటారు. ఫార్మసీకి వెళ్లి యాంటీబయాటిక్స్ తీసుకురావడం, జలుబు, దగ్గుకు సొంతంగా ఔషధాలు వేస్తుంటారు. ఇలా ప్రతిసారీ ఇవ్వడంతో సహజమైన రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంది. సకాలంలో వైద్యులను సంప్రదించి తగిన వైద్యం అందించాలి.



వ్యాయామం : పిల్లలను ఆడుకోనివ్వాలి. సూర్యకాంతిలో ఆడుకునే అవకాశం ఇవ్వాలి. రెగ్యులర్ వ్యాయామం పిల్లల పూర్తి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. రన్నింగ్, జాగింగ్, సైక్లింగ్, స్కిప్పింగ్ లాంటివి చేయించాలి. వ్యాయామం వల్ల శరీరంలో వెచ్చదనం కూడా పెరుగుతుంది. ఫిట్‌గా ఉంటారు. వ్యాధి కారకాలతో శరీరం మెరుగ్గా పోరాడగల్గుతుంది. ఉదయం ఎండ వచ్చాక వారిని కాసేపు సూర్యరశ్మి తగిలేలా తీసుకెళ్లాలి. దీంతో శరీరానికి కాస్త వేడి తగులుతుంది. రోగ నిరోధకశక్తిని పెంచే విటమిన్ డి కూడా లభిస్తుంది. అయితే ఎక్కువగా చలిగా ఉన్నప్పుడు పిల్లలను బయటకు తీసుకెళ్లకూడదు.

జాగ్రత్తలివే...

రాత్రి వేళ చల్లని గాలులు గదిలోకి రాకుండా చూసుకోవాలి. బయట చలిగా ఉన్న సమయంలో పిల్లలను ఎక్కువ సమయం బయట గడపకుండా జాగ్రత్తలు వహించాలి.

వెచ్చగా ఉండేందుకు మందంగా ఉండే దుస్తులు లేదా స్వెట్టర్లు ధరింపజేయాలి. తలకు మఫ్లర్ (టోపీ), చేతులకు గ్లౌజులు, పాదాలకు సాక్స్ వంటి అదనపు రక్షణ దుస్తులు ధరించాలి.

చలికాలంలో ముఖం, చేతులు, పాదాలు, మడమలు పగిలిపోవడం సాధారణం. తల స్నానానికి ముందు నూనె రాసి కాసేపు ఉంచిన తర్వాత స్నానం చేయించాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. స్నానం వేడి నీటితో చేయించాలి. ఆ తర్వాత పొడిగా ఉండే దుస్తులను వేయాలి.

లోక్‌సభలో ప్రతిపక్షాల వాకౌట్

- సంభాల్‌లో హింసకు బిజెపి కుట్ర: ఎస్‌పి విమర్శ



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో మంగళవారం కూడా విపక్షాలు ఆందోళనకు దిగాయి. గౌతమ్ అదాని వ్యవహారంపై చర్చకు ఇండియా వేదిక ఎంపిలు లోక్‌సభలో ఆందోళన చేపట్టారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదాని అంశాన్ని ప్రతిపక్షాలు లేవనెత్తాయి. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ... వాకౌట్ చేశాయి.

రాజ్యసభలో 42 వాయిదా తీర్మానాల నోటీసుల తిరస్కరణ

రాజ్యసభలో 42 వాయిదా తీర్మానాలను ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ తిరస్కరించారు. రాజ్యాంగం ఆమోదించిన తర్వాత అత్యధికంగా రూల్ 267 కింద 42 నోటీసులు వచ్చాయని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లోకి 'రోహింగ్యాల'ను ఆ రాష్ట్ర ప్రభుత్వం స్వాగతించిందని పశ్చిమ బెంగాల్ బిజెపి ఎంపి సమిక్ భట్టాచార్య చేసిన ఆరోపణలపై ప్రతిపక్ష సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. దీంతో, సభలో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు.

ఉభయ సభల్లో 2 బిల్లులు ఆమోదం

అదానీ వ్యవహారంపై గత వారం అంతా స్తంభించిన పార్లమెంటులో మంగళవారం సాఫీగా కార్యకలాపాలు సాగించింది. పార్లమెంట్ ఉభయ సభల్లో రెండు బిల్లులు ఆమోదం పొందాయి. చమురు క్షేత్రాల (నియంత్రణ, అభివృద్ధి) సవరణ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందగా, బ్యాంకింగ్ లా (సవరణ) బిల్లును లోక్‌సభ ఆమోదించింది. రాజ్యసభలో బిల్లును కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి ప్రవేశపెట్టగా, చర్చ అనంతరం మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. అంతకుముందు సిపిఎం ఎంపిలు జాన్ బ్రిట్టాస్, ఎ రహీం బిల్లుకు కొన్ని సవరణలు ప్రతిపాదించారు. రాజ్యసభలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు భారతీయ వాయుయాన్ విధేయక బిల్లును ప్రవేశపెట్టారు. రాజ్యసభలో కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బ్యాంకింగ్ లా (సవరణ) బిల్లును మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది.

ప్రణాళిక ప్రకారమే సంభాల్‌లో హింస : అఖిలేష్ యాదవ్

పక్కా ప్రణాళిక ప్రకారమే సంభాల్‌లో హింసకు పాల్పడ్డారని, మత సామరస్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించారని సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ విమర్శించారు. లోక్‌సభ జీరో అవర్‌లో సంభాల్‌లో హింసపై ఆయన మాట్లాడుతూ మసీదు వద్ద సర్వే ద్వారా.. గంగా – జమునా తెహజీబ్ సాంప్రదాయాన్ని దెబ్బతీస్తున్నారని విమర్శించారు. ఎక్కడపడితే అక్కడ తవ్వుతూ ఈ దేశ సోదరభావాన్ని కోల్పోయేలా చేస్తున్నారని అన్నారు. సంభాల్ హింసలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారన్న అఖిలేష్ వ్యాఖ్యలపై బిజెపి ఎంపిలు నానా యాగీ చేశారు. అఖిలేష్‌కు మద్దతుగా పలువురు ప్రతిపక్ష ఎంపిలు నిలిచారు. సభ ఆర్డర్‌లోకి వచ్చిన తరువాత అఖిలేశ్ యాదవ్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఈ ప్రభుత్వం రాజ్యాంగాన్ని విశ్వసించదని, రాజ్యాంగంపై నమ్మకం లేదని విమర్శించారు. యుపిలో నవంబర్ 13న జరగాల్సిన ఉప ఎన్నికలను వాయిదా వేశారని చెప్పారు. నవంబర్ 19న మసీదులో సర్వే చేయించి, 20న ఎన్నికలు నిర్వహించినట్లు ఆయన గుర్తు చేశారు. నవంబర్ 24న మరోసారి సర్వే చేపట్టారని, ఆ ప్రదేశానికి చేరుకున్న ప్రజలపై సర్కిల్ ఆఫీసర్ లాఠీచార్జ్ చేశారని, ఆ తరువాత పోలీసులు ఫైరింగ్ చేశారని చెప్పారు. డజన్ల సంఖ్యలో జనం గాయపడ్డారని, దాంట్లో ఐదుగురు మరణించారని, పోలీసులపై హత్య కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సంభాల్ అల్లర్లు ముందస్తు ప్రణాళికతో జరిగిన కుట్ర అని అన్నారు. సంభాల్ జిల్లాలో సామరస్యానికి బిజెపి విఘాతం కలిగిస్తోందని విమర్శించారు. రాజ్యసభలో ఎస్‌పి ఎంపి రాంగోపాల్ యాదవ్ సంభాల్ ఘటనను లేవనెత్తారు. దేశంలో అశాంతిని సృష్టించడానికి ప్రణాళికాబద్ధమైన కుట్ర జరుగుతోందని విమర్శించారు. సంభాల్‌లో ఐదుగురు మరణించినా, మరో 20 మంది గాయపడినా.. ఇప్పటివరకూ ఎఫ్‌ఐఆర్ నమోదు చేయలేదని చెప్పారు. 'ఇది ముందస్తుగా ప్లాన్ చేసిన కుట్ర కాకపోతే, బుదౌన్, అజ్మీర్ షరీఫ్, జనుపూర్‌లలో అదే జరిగింది. దేశం మొత్తం నిప్పంటించే కుట్ర జరుగుతోంది' అని ఆయన విమర్శించారు.

టాప్‌లోనే ఆంధ్ర

- కేరళపై ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం
- సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ


శ్రీకర్ భరత్(56పరుగులు)

హైదరాబాద్: సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు వరుసగా ఐదో విజయాన్ని సొంతం చేసుకొని టాప్‌లోనే కొనసాగుతోంది. జింఖానా మైదానంలో కేరళతో జరిగిన గ్రూప్-ఇ లీగ్ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత ఆంధ్ర బౌలర్లు సమిష్టిగా చెలరేగడంతో కేరళ జట్టు 18.1ఓవర్లలో 87పరుగులకే కుప్పకూలింది. ఆ లక్ష్యాన్ని ఆంధ్ర జట్టు 13 ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఆంధ్ర బౌలర్లు కెవి శశికాంత్ మూడు, బోధల కుమార్, సుదర్శన్ రెండేసి వికెట్లతో స్తా చాటారు. బ్యాటింగ్‌లో శ్రీకర్ భరత్(56) అజేయ అర్ధసెంచరీకి తోడు రికీ బుయ్(14) బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో గ్రూప్-ఇలో ఆంధ్ర జట్టు ఐదు మ్యాచ్‌లు ముగిసేసరికి 20 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా.. ముంబయి, కేరళ 16పాయింట్లతో రెండోస్థానంలో కొనసాగుతున్నాయి.

పోరాడి ఓడిన హైదరాబాద్

సౌరాష్ట్ర మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు ఏడు పరుగుల తేడాతో మధ్యప్రదేశ్ చేతిలో ఓటమిపాలైంది. గ్రూప్-ఎలో భాగంగా మంగళవారం జరిగిన ఈ పోటీలో తొలుత మధ్యప్రదేశ్ 20ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 178పరుగుల భారీస్కోర్ నమోదు చేసింది. ఓపెనర్లు సేనాపతి(42), హర్ష్(51) అర్ధసెంచరీలకి తోడు కెప్టెన్ రజత్ పటీధర్(36) బ్యాటింగ్‌లో రాణించారు. హైదరాబాద్ బౌలర్లు మిలింద్, గౌడ్‌కు మూడేసి, నితిన్ సాయి రెండు వికెట్లతో రాణించారు. ఛేదనలో హైదరాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 9వికెట్లు కోల్పోయి 171పరుగులే చేయగల్గింది. తన్మయ్ అగర్వాల్ (47), కెప్టెన్ తిలక్ వర్మ(46), రాహుల్ బుద్ధ(20) బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో గ్రూప్-ఎలో హైదరాబాద్ జట్టు 6మ్యాచ్‌లు ముగిసేసరికి 8పాయింట్లతో 5వ స్థానంలో ఉంది.

పాయింట్ల పట్టిక

గ్రూప్-ఎ					
1. రాజస్తాన్	6	5	1	+2.68	20
2. బెంగాల్	6	5	1	+1.78	20
3. మధ్యప్రదేశ్	6	5	1	+1.58	20
4. పంజాబ్	6	4	2	+0.90	16
5. హైదరాబాద్	6	2	4	+1.61	8
6. బీహార్	6	2	4	-1.80	8
7. మిజోరాం	6	1	5	-2.42	4
8. మేఘాలయ	6	0	6	-4.20	0
గ్రూప్-ఇ					
1. ఆంధ్రప్రదేశ్	5	5	0	+3.00	20
2. ముంబయి	5	4	1	+1.33	16
3. కేరళ	6	4	2	+0.85	16
4. సర్వీసెస్	5	2	3	+0.48	8
5. మహారాష్ట్ర	5	2	3	-0.62	8
6. గోవా	5	1	4	-1.13	4
7. నాగాలాండ్	5	0	5	-4.22	0

బందీలను విడిచిపెట్టండి లేకుంటే నరకం చూపిస్తా

- ట్రంప్ హూంకరింపు

న్యూయార్క్ : హమాస్ చెరలో వున్న ఇజ్రాయిల్ బందీలను తక్షణమే విడుదల చేయాలని, లేకుంటే నరకం చూపిస్తానని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ బెదిరించారు. . తాను ప్రమాణ స్వీకారం చేయడానికి ముందే వారిని విడుదల చేయాలని ట్రంప్ హుకుం జారీ చేశారు. ఈ మేరకు ఆయన ట్రూత్‌లో పోస్టు పెట్టారు. ఇజ్రాయిలీలను బందీలుగా చేయడానికి ఎవరైతే బాధ్యులో వారు కచ్చితంగా మిగిలిన వారికన్నా దెబ్బ తింటారన్నారు. ఈ బెదిరింపులు చూస్తుంటే గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమానికి అమెరికా మరింత ఆజ్యం పోసేలా ఉందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. నేరుగా అమెరికా సైన్యం రంగంలోకి దిగుతుందా అన్న అనుమానాలకు ట్రంప్ వ్యాఖ్యలు ఆస్కారమిస్తున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలను ఇజ్రాయ్ అధ్యక్షుడు ఇజాక్ హెర్జోగ్ స్వాగతించారు.. అమెరికా, ఇజ్రాయిల్‌ల్లో ద్వంద్వ పౌరసత్వం కలిగిన ఒమర్ న్యూట్రా మృతి చెందాడని ఇజ్రాయిల్ ప్రభుత్వం ధ్రువీకరించిన గంటల వ్యవధిలోనే ట్రంప్ ఈవిధమైన బెదిరింపులకు దిగారు. ఒమర్ న్యూట్రా మృతదేహం ఇంకా హమాస్ అదుపులోనే వుందని భావిస్తున్నారు. తమ విడుదల కోసం ట్రంప్ కృషి చేయాలని అంతకు కొన్ని రోజుల ముందే హమాస్ చెరలో వున్న మరో బందీ ఎడాన్ అలెగ్జాండర్ విజ్ఞప్తి చేశారు.

నెతన్యాహు వస్తే అరెస్టు చేస్తాం

- న్యూజిలాండ్ ప్రధాని ప్రకటన

వెల్లింగ్టన్ : ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు తమ దేశంలోకి ప్రవేశిస్తే వెంటనే అరెస్టు చేస్తామని న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ ప్రకటించారు. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుకు తాము మద్దతిస్తామని ఆయన సోమవారం ఒక పత్రికా సమావేశంలో తెలిపారు. అంతర్జాతీయ న్యాయ వ్యవస్థ పట్ల తమకు నమ్మకం వుందన్నారు. ఐసిసి ఇటీవల నెతన్యాహు, యోవ్ గాలంట్‌లకు అరెస్టు వారంట్లు జారీ చేసిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. వారిద్దరు యుద్ధ నేరాలకు పాల్పడ్డారని విమర్శించింది. గత 13 మాసాలుగా గాజాలో ఇజ్రాయిల్ మారణహోమం సాగిస్తున్నదని, వేలాదిమందిని పొట్టనబెట్టుకుందని ఇవన్నీ మానవాళికి వ్యతిరేకంగా చేపట్టే యుద్ధ నేరాల కిందకే వస్తాయని విమర్శించింది. పాలస్తీనియన్ల రక్షణకు పిలుపునిస్తూ న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, కెనడాలు సంయుక్తంగా ఒక ప్రకటన జారీ చేశాయి.

విద్యుత్ శాఖ అభ్యంతరాలు బేఖాతర్

(మొదటిపేజీ తరువాయి)

సూచించినట్లు సమాచారం. ఈ సూచనలను కూడా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. తెలిసింది. కేబినెట్ ముందు పెట్టిన నోట్‌లో మొత్తం అభిప్రాయాలను పొందుపరిచిన విద్యుత్‌శాఖ 'దీర్ఘకాలిక పరిణామాలను దృష్టిలో ఉంచుకుని సెకితో చర్చలు జరిపి తదుపరి చర్యలు తీసుకోవాలి' అని సూచించినట్లు సమాచారం. అయితే, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన 2021 సెప్టెంబర్ 16న జరిగిన కేబినెట్ సమావేశం 'రూ. 2.49 యూనిట్ రేటుకు 9 గిగా వాట్ల సోలార్ ప్రాజెక్టు అమలు కోసం సెకితో కలిసి ముందుకు వెళ్లాలి'. అని విద్యుత్ శాఖను ఆదేశించింది.



గుకేశ్ అద్భుత వ్యూహం

- ఏడోరౌండ్‌తో 72ఎత్తుల తర్వాత డ్రా
- ఫిడే ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్

సింగపూర్: ప్రపంచ ఛెస్ కిరీటం కోసం జరుగుతున్న పోరులో భారత గ్రాండ్‌మాస్టర్ డి. గుకేశ్ చైనా గ్రాండ్ మాస్టర్ డింగ్ లెరెన్‌కు చెమటలు పట్టిస్తున్నాడు. మంగళవారం జరిగిన ఏడోరౌండ్‌లో గుకేశ్ చివర్లో గెలుపుకు చేరువై 72 ఎత్తుల నిర్ణీత సమయం ముగియడంతో డ్రాతో సంతృప్తి పడ్డాడు. తొలుత ఫలితం కోసం నిర్ణీత 40ఎత్తుల ఆడగా.. తర్వాత అదనపు సమయం కేటాయించారు. 41 నుంచి 46 ఎత్తుల గుకేశ్ కొంత ఒత్తిడికి గురైనా.. ఆ తర్వాత గుకేశ్ అద్భుతంగా పుంజుకున్నాడు. చివర్లో గుకేశ్ చేతిలో రాజు, గుర్రం ఉండగా.. డింగ్ రాజు మినహా మిగిలిన సైన్యాన్ని అంతటినీ కోల్పోయాడు. ఆ దశలో 70ఎత్తుల సమయం ముగిసింది. తెల్లపావులతో బరిలోకి దిగిన గుకేశ్ ఎన్‌ఎఫ్-3తో గేమ్‌ను ప్రారంభించగా.. నల్లపావులతో ఆడిన డింగ్ లెరెన్ డి-5తో గేమ్‌ను మొదలుపెట్టాడు.

అంధుల టి20 ప్రపంచ కప్ ఛాంపియన్ పాక్



ముల్తాన్: అంధుల క్రికెట్ జట్టు టి20 ప్రపంచ కప్ టైటిల్‌ను పాకిస్తాన్ జట్టు కైవసం చేసుకుంది. మంగళవారం జరిగిన ఫైనల్లో పాక్ 10వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించింది. ముల్తాన్ వేదికగా జరిగిన ఫైనల్లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 139పరుగులు చేసింది. ఆరిఫ్ హుస్సేన్(54) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. పాక్ బౌలర్లలో బాబర్ అలీ రెండు, మొహమ్మద్ సల్మాన్, మతివుల్లా తలో వికెట్ దక్కించు కున్నారు. ఆ లక్ష్యాన్ని పాకిస్తాన్ కేవలం 11 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ నిసార్ అలీ అజేయమై అర్ధ సెంచరీతో(72)కి తోడు మరో ఓపెనర్ మొహమ్మద్ సఫ్దార్(47నాటౌట్) గెలుపులో కీలకపాత్ర పోషించారు. 12ఏళ్ల ఈ టోర్నీ చరిత్రలో పాక్ టైటిల్ గెలవడం ఇదే తొలిసారి. ఈ టోర్నీకి భద్రతా కారణాల దృష్ట్యా భారత ప్రభుత్వం టీమిండియాను పాక్‌కు పంపలేదు.

రెండో టి20లో జింబాబ్వేపై 10వికెట్ల తేడాతో పాక్ గెలుపు

జింబాబ్వేతో జరిగిన రెండో టి20లో పాకిస్తాన్ స్పిన్నర్ ముస్కీమ్ రికార్డు బౌలింగ్‌తో చెలరేగాడు. సంచలన బౌలింగ్‌తో మెరిసాడు. ముస్కీమ్(2.4-0-3-5) అద్భుత స్పెల్‌కు జింబాబ్వే 12.4ఓవర్లలో 57పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లు బెన్నెట్(21), మరుమణి(16) తొలివికెట్‌కు 37పరుగులు జతచేసినా.. మిగతా బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. అబ్బాస్ అఫ్రిది(2/2), రవూఫ్, అహ్మద్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఆ లక్ష్యాన్ని పాకిస్తాన్ ఓపెనర్లు 5.3ఓవర్లలోనే ఛేదించారు. యూసుఫ్(22), ఆయుబ్(36) మ్యాచ్‌ను ముగించారు.

చరిత్రపుటల్లోకెక్కిన పాక్ బౌలర్

పాకిస్తాన్ రిస్ట్ స్పిన్నర్ సుఫియాన్ ముఖీమ్ చరిత్రపుటల్లోకెక్కాడు. జింబాబ్వేపై ముఖీమ్ 2.4 ఓవర్లలో కేవలం 3 పరుగులు మాత్రమే ఇచ్చి 5 వికెట్లు తీశాడు. పాకిస్తాన్ తరఫున టి20ల్లో ఇదే అత్యుత్తమ గణాంకాలు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68